ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
సోమవారం 22 జనవరి 2024


ప్రభుత్వ భూమిలో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

బరి తెగించారు..!

● పుల్లంపేటలో 50 ఎకరాలు భూకబ్జా ● కబ్జా భూమిలో మామిడి, అరటి తోటల సాగు ● కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూమి స్వాహా
● ట్రాన్స్‌ఫార్మర్లు, ఫెన్సింగ్ ఏర్పాటు ● అసైన్‌మెంట్ కమిటీలో చేర్చేందుకు చేతులు మారిన లక్షలాది రూపాయలు

పుల్లంపేటలో ప్రభుత్వ భూమి కనిపించిందంటే చాలు కబ్జారాయుళ్ల కబంధ హస్తాల్లో చిక్కుకోవాల్సిందే. మండల కేంద్రానికి చుట్టుపక్కల ఎక్కడా ప్రభుత్వ భూమి అనేదే లేకుండా అక్రమార్కులు కబ్జా చేసేశారు. భవిష్యత్తులో ప్రభుత్వ అవసరాలకు భూమి అనేదే లేకుండా చేశారు. మండల కేంద్రానికి కిలోమీటరు దూరంలో దాదాపు 50 ఎకరాలకు పైగా కొందరు కబ్జా చేసి మామిడి, అరటి తోటలు సాగు చేశారు. ఈ భూమి విలువ కోట్లాది రూపాయలు ఉంటుంది. ఆక్రమిత భూమికి ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేశారు. ట్రాన్స్‌కో అధికారులు ఆ భూమిలో ట్రాన్స్‌ఫార్మర్లు కూడా ఏర్పాటు చేశారు. ఇదంతా రెవెన్యూ అధికారులకు తెలిసినా పట్టించుకోకపోవడం కొసమెరుపు.

పుల్లంపేట, జనవరి 21: మండల కేంద్రానికి కిలోమీటరు దూరంలో ప్రభుత్వ భూమిని కొందరు దర్జాగా కబ్జా చేసి ఆ భూమిలో మొక్కలు నాటి డ్రిప్ కూడా ఏర్పాటు చేస్తున్నారు. అంతేకాకుండా సొంత భూమి అయినట్లు చుట్టూ ఫెన్సింగ్ బలంగా తీస్తున్నారు. దీనికి తోడు ట్రాన్స్‌కో అధికారులు కూడా ఆ భూమిలో ట్రాన్స్‌ఫార్మర్లు కూడా ఏర్పాటు చేశారు. ఇదంతా తెలిసినా రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంతో వారిపై అనేక ఆరోపణలు వస్తున్నాయి. ఇక్కడ సెంటు భూమి లక్ష రూపాయలకు పైగా పలుకుతుండటంతో కబ్జాదారులు రోజురోజుకు పేట్రేగిపోతూ ఏకంగా చెరువుల్లోకే ఫెన్సింగ్ తీసేశారు. వీటికి పకడ్బందీగా రికార్డులు తయారు చేసుకునేందుకు ఈ భూములను అసైన్‌మెంట్ కమిటీ ద్వారా హక్కులు పొందేందుకు లక్షలాది రూపాయలు చేతులు మారినట్లు ఆరోపణలు వస్తున్నాయి. మండలంలోని కొమ్మనవారిపల్లె రెవెన్యూ గ్రామంలో పుల్లంపేట మండల కేంద్రానికి కిలోమీటరు దూరం కూడా లేని సర్వే నెంబరు-100లో ప్రభుత్వ భూమి కబ్జాకు గురైంది. సుమారు రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని ఓ సర్పంచ్‌తో పాటు అతడి అనుచరుడు కబ్జా చేశారు. ఇందులో టెంకాయ చెట్లు, మామిడి చెట్లు వేశారు. డ్రిప్ కూడా ఏర్పాటు చేశారు. ఇటీవల బోరు వేసి ట్రాన్స్‌ఫార్మర్ కూడా ఏర్పాటు చేసుకున్నారు. ఇక్కడ సెంట్లు లక్ష రూపాయలకు పైగా పలుకుతుంది. అంటే ఈ భూమి విలువ సుమారు రూ.2 కోట్లకు పైగా ఉంటుంది. ఈ స్థలానికి ఆనుకుని సుమారు నాలుగు కాల నీలు ఉండటంతో ఈ స్థలంపై కన్నేసి కబ్జా చేసేశారు. అసైన్‌మెంట్ కమిటీలో పెట్టి సర్వహక్కులు పొందేందుకు లక్షలాది రూపాయలు ఖర్చు చేశామని, తమను ఎవరూ ఏమీ చేయలేరని కబ్జాదారులు బహిరంగంగా చెప్పుకుంటున్నట్లు స్థానికులు చెబుతున్నారు. సర్వే నెంబరు-107లో సుమారు 5 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి ఉంది. గతంలో పనిచేసిన ఓ తహసీల్దారు ఈ భూమిలో పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చారు. గతంలో ఈ భూమిని కబ్జా చేసిన వ్యక్తి అడ్డుపడటంతో ఆ తహసీల్దారు అప్పట్లో హెచ్చరించారు. అయితే లక్షలాది రూపాయలు కాసులకు, బంగారు బిస్కెట్లు ఎరవేయడంతో ఒకటిన్నర ఎకరా అతడి పేరుతో ఆన్‌లైన్ చేసేశారు. ఒకటిన్నర ఎకరా ఆన్‌లైన్ చేయడంతో అంతా నాదేనని సుమారు 5 ఎకరాల వరకు ఆక్రమించి చుట్టూ ఫెన్సింగ్ తీసి డ్రిప్ ఏర్పాటు చేశారు. సుమారు 300 మీటర్ల దూరంలో బోరు వేసి అక్కడి నుంచి నీటిని పంపింగ్ చేసుకుంటూ అరటి పంటను సాగు చేస్తున్నారు. రెవెన్యూ అధికారులకు ఇవి ఏమాత్రం పడటం లేదు. ఈ భూములకు విలువ ఉండటంతో కబ్జారాయుళ్లు రెవెన్యూ అధికారులకు లక్షలాది రూపాయలు ఎరవేస్తుండటంతో మిన్నకుండిపోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ భూమి అని తహసీల్దారు గుర్తించి అందులో పట్టాలు పంపిణీ చేసి కబ్జారాయుళ్లని హెచ్చరించిన ఆ తహసీల్దార్ ఆ తరువాత నిబంధనలకు విరుద్ధంగా ఆన్‌లైన్ చేయడాన్ని బట్టి చేస్తూ కబ్జారాయుళ్లకు రెవెన్యూ అధికారులు ఏవిధంగా సహకరిస్తున్నారో తెలుస్తోంది.

అలాగే కొత్తపల్లె అగ్రహారం వెళ్లే దారిలో కూడా ప్రభుత్వ భూమి అధికంగా ఉంది. ఇది కూడా పుల్లంపేటకు అతి సమీపంలో ఉంది. ఇక్కడైతే ఒక్కొక్కరూ ఏకంగా ఐదు నుంచి 15 ఎకరాల వరకు ప్రభుత్వ భూములు కబ్జా చేసి వీటిని మరొకరికి అమ్ముకున్నారు. ఆ తరువాత లక్షలాది రూపాయలు పెట్టి ఈ భూములను ఏకంగా ఆన్‌లైన్ చేసుకున్నారు. ఆ తరువాత వీటిని బ్యాంకులో పెట్టి రుణాలు తీసుకున్నారు. అసైన్‌మెంట్ కమిటీ రిజిష్టర్‌లో ఈ భూములకు సంబంధించి ఎటువంటి రికార్డులు లేవు. అయితే తహసీల్దార్లు మాత్రం లక్షలాది రూపాయలు తీసుకుని ఏకంగా ఆన్‌లైన్ చేసేశారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఆన్‌లైన్ అయితే సర్వహక్కులు తమకే ఉన్నాయని వీటిని బేరసారాలు పెడుతున్నారు. ఇక్కడ ఉన్న సుమారు 50 నుంచి 70 ఎకరాలు అంతా కోనమ్మచెరువు, దాని చుట్టుపక్కల ఉన్న భూమే.. అధికారబలం, అర్థబలం అధికంగా ఉన్న వారు ఇక్కడ భూములు కబ్జా చేసి ఏకంగా రెండు నుంచి ఐదు బోర్ల వరకు వేసేశారు. చుట్టూ లక్షలాది రూపాయలు పెట్టి ఫెన్సింగ్ తీసేశారు. ప్రభుత్వ భూములు అయినా వీటికి ఆన్‌లైన్ చేయడంతో విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్లు కూడా పెట్టేశారు. ఓ పేదవాడు బోరు వేసుకోవాలన్నా.. ట్రాన్స్‌ఫార్మర్ పెట్టుకోవాలన్నా రెవెన్యూ అధికారులు, ట్రాన్స్‌కో అధికారులు సవాలక్ష నిబంధనలు చెబుతారు. అయితే ఈ భూములకు మాత్రం భారీగా డబ్బులు ముట్టజెప్పడంతో కళ్లు మూసుకుపోయి అధికారులందరూ తమకు జేబులు నిండితే చాలనుకుని ప్రభుత్వ భూములు కబ్జా చేసేందుకు పరోక్షంగా సహకరిస్తున్నారు. మండల కేంద్రానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఎక్కడా అసైన్‌మెంట్ కమిటీ ద్వారా పట్టాలిచ్చేందుకు నిబంధనలు లేవు. అయితే కిలోమీటరు దూరంలోనే కబ్జా జరుగుతున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. కబ్జారాయుళ్లు వీటిని అసైన్‌మెంట్ కమిటీలో పెట్టి సర్వహక్కులు పొందేందుకు లక్షలాది రూపాయలు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. రెవెన్యూ అధికారులు పూర్తి స్థాయిలో కబ్జారాయుళ్లకు సహకరించేందుకు సిద్ధపడినట్లు సమాచారం. ప్రభుత్వ భూములు కాపాడాల్సిన అధికారులే కబ్జారాయుళ్లకు సహకరిస్తున్నారని స్థానికులు అంటున్నారు. పుల్లంపేటకు సమీపంలో ప్రభుత్వ స్థలం లేదన్న సాకుతో గతంలో ఆదర్శ పాఠశాల, కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో మరోచోట ఏర్పాటు చేయాల్సి వచ్చింది. భవిష్యత్తులో నూతన ప్రభుత్వ కార్యాలయాలకు గానీ, విద్యాలయాలకు గానీ పుల్లంపేట సమీపంలో ఒక్క సెంటు భూమి కూడా లేదు. ఉన్నదంతా కోనమ్మ చెరువు సమీపంలో ఉన్న భూమే.. ఈ భూమంతా కబ్జారాయుళ్ల చేతికి వెళ్లిపోవడంతో భవిష్యత్తులో మండలంలో ఎటువంటి ప్రభుత్వ కార్యాలయాలకు నూతన భవనాల ఏర్పాటు చేసే అవకాశమే లేదు. గత కొన్నేళ్లుగా విద్యుత్ కార్యాలయానికి అంగన్వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు నిర్మాణానికి స్థలం లేక ఆగిపోయాయి. ఉన్నతాధికారులు ఈ ప్రభుత్వ భూమిపై పూర్తి స్థాయిలో రికార్డులు పరిశీలించి స్వాధీనం చేసుకుంటే భావితరాలకు ఈ భూమి ఎంతో ఉపయోగపడనుంది. లేదంటే ప్రభుత్వ భూమి లేక కార్యాలయాలు వెనక్కి మళ్లే అవకాశం కూడా ఉంది. పుల్లంపేటకు అతి సమీపంలో ఉండటంతో ఇక్కడ భూములకు కూడా భారీగా రెక్కలు వచ్చాయి. చుట్టుపక్కల సుమారు సెంటు లక్షకు పైగా పలుకుతుంది. అంటే ఎకరా కోటి రూపాయలు అన్నమాట.. ఇక్కడ ఉన్న భూమంతా కబ్జారాయుళ్ల చేతిలో ఉండటంతో ప్రభుత్వానికి కోట్ల రూపాయలు నష్టం జరుగుతుంది. ఇంత జరుగుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటం పట్ల స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వారం క్రితం ఏకంగా కబ్జారాయుళ్లు చెరువులో రోడ్డును ఆనుకుని కబ్జా చేసి ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. అధికారులకు ఫిర్యాదు అందినా పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. కబ్జారాయుళ్లు భారీ స్థాయిలో చేతులు తడపడంతో రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతుంటే కాపాడాల్సిన రెవెన్యూ అధికారులు మౌనంగా ఉన్నారంటే ఎవరైనా అర్థం చేసుకోవచ్చు. లక్షలాది రూపాయలు జీతాలు తీసుకుంటూ ప్రభుత్వ భూములు కాపాడలేదని రెవెన్యూ అధికారులు పరోక్షంగా కబ్జారాయుళ్లకు సహకరిస్తుండటం మండలంలో చర్చనీయాంశమైంది.


సర్వే నెంబరు 100లో ప్రభుత్వ భూమి ఆక్రమించి సాగు చేస్తున్న మామిడి తోట, చుట్టూ ఏర్పాటు చేసిన కంచె


కోనమ్మ చెరువును ఆక్రమించి వేసిన కంచె


ప్రభుత్వ భూమి అని పట్టాలిచ్చిన తహసీల్దారే ఆ భూమిని తిరిగి ఆన్‌లైన్ చేయడంతో సాగవుతున్న అరటి తోట

ఆక్రమణదారులకు నోటీసులు ఇస్తాం..

ఆక్రమణలను గుర్తించాము. భూఆక్రమణ 1905 చట్టం ప్రకారం ఆక్రమణదారులందరికీ ఏడు నోటీసులు జారీ చేస్తాం. తక్షణమే వాటిపై చర్యలు తీసుకుంటాం. ఇది వరకే గ్రామాల్లో విలేజ్ రెవెన్యూ అధికారులకు ఎక్కడా ఎలాంటి భూఆక్రమణలకు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చాం. అయినా ఆక్రమణలు జరగడంతో వెంటనే చర్యలు చేపడతాం.

- నరసింహకుమార్, తహసీల్దార్, పుల్లంపేట

టీడీపీ, జనసేన సునామీలో

వైసీపీ కొట్టుకుపోతుంది

● నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి ● పీలేరు, కేవీపల్లె మండలాల నుంచి టీడీపీలో భారీగా చేరికలు

పీలేరు, జనవరి 21: త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ, జనసేన సృష్టించే సునామీలో వైసీపీ కొట్టుకుపోవడం ఖాయమని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి అన్నారు. పీలేరు, కేవీపల్లె మండలాలకు చెందిన వైసీపీ నాయకులు ఆదివారం కిశోర్ సమక్షంలో భారీగా టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా పీలేరు మండలం తలపుల గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ ఒక్క ఛాన్సు అంటూ అధికారంలోకి వచ్చిన వైసీపీ గడిచిన నాలుగున్నరేళ్లలో చేసిన అరాచకాలు, మోసాలు, దౌర్జన్యాలకు రాష్ట్ర ప్రజలు విసిగిపోయి ఉన్నారన్నారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా టీడీపీ, జనసేనకు పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఓటమి ఖాయమని నిర్ధారించుకున్న వైసీపీ నాయకులు గ్రామాల్లో కుల, మతాల మధ్య చిచ్చుపెట్టడమే కాకుండా ప్రజలను విభజించి పాలించేందుకు కుట్రలు పన్నుతున్నారన్నారు. అంతే కాకుండా ప్రజలు స్వచ్ఛందంగా ఓట్లు వేయరన్న అనుమానంతో పెద్దఎత్తున దొంగ ఓట్లను చేర్చుకుని వాటి ద్వారా గెలిచేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఐఏఎస్ వంటి ఉన్నత చదువులు వారిని సైతం ప్రలోభాలు, బెదిరింపులు, అత్యాశలకు గురి చేస్తున్నారన్నారు. టీడీపీపై నమ్మకంతో పార్టీలో చేరిన వారందరికీ సముచిత స్థానం ఉంటుందని, అందరికీ గౌరవ మర్యాదలతో పాటు గుర్తింపు ఉంటుందన్నారు. రాష్ట్రం అప్పుల నుంచి బయటపడాలన్నా, రాష్ట్ర ప్రజలు మళ్లీ సుఖసంతోషాలతో ఉండాలన్నా చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని, ఈ విషయాన్ని సామాన్య ప్రజలకు వివరించి వారిని టీడీపీ వైపు మళ్లించాలన్నారు. అనంతరం తలపుల గ్రామానికి చెందిన మురళీమోహన్ రెడ్డి, వెంకటరమణా రెడ్డి, కేవీపల్లె మండలం మాజీ జడ్పీటీసీ హరినాథరెడ్డిల నేతృత్వంలో టీడీపీలో చేరేందుకు వచ్చిన సుమారు 150 కుటుంబీకులకు ఆయన టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో పీలేరు, తలపుల గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


టీడీపీలో చేరిన వైసీపీ నాయకులతో నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి

మార్కెట్ యార్డులో మళ్లీ మొదలైన వివాదం

● బంద్‌కు పిలుపునిచ్చిన పసుపు వ్యాపారుల సంఘం ● నేటి నుంచి కొనుగోళ్ల నిలిపివేత

కడప (రూరల్) జనవరి 21 : కడప మార్కెట్ కమిటీ పసుపు యార్డులోని 16/329 నెంబర్‌లోని గిడ్డంగి వివాదం మళ్లీ మొదలైంది. పసుపు యార్డు పరిధిలోని సదరు గిడ్డంగిని డి.ఫిరోజ్ అలీఖాన్, డి.నిషార్, అహ్మద్ ఆలీఖాన్ తదితరులు కొనుగోలు చేసి అక్కడ పండ్లను నిల్వ ఉంచుకునేందుకు వీలుగా శీతల గిడ్డంగి (కోల్డ్ స్టోరేజ్)గా మార్చేందుకు పనులను చేపడుతున్నారు. ఈ మేరకు పసుపు మార్కెట్ యార్డులో పండ్లను నిల్వ ఉంచుకునే శీతల గిడ్డంగి పనులు చేపట్టరాదని పసుపు వ్యాపారుల సంఘం ఏజెంట్లు ఆక్షేపించారు. ఈ సమస్య జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పరిష్కారం కాలేదు. ఈ మేరకు ఇరుపక్షాలు కోర్టును ఆశ్రయించారు. దీంతో తాజాగా కోర్టు తీర్పు తమకు అనుకూలంగా వచ్చిందని.. ఈ మేరకు శీతల గిడ్డంగి పనులను నిలుపుదల చేయించాలని పసుపు వ్యాపారుల సంఘం సంబంధిత అధికారులకు సూచించింది. కానీ ప్రయోజనం లేకపోవడంతో సోమవారం నుంచి బంద్‌కు పిలుపునిచ్చింది. ఈ మేరకు వ్యవసాయ మార్కెట్‌యార్డు సెక్రటరీ బాల వెంకటరెడ్డికి మెమొరాండం అందజేశారు. దీంతో నేటి నుంచి మార్కెట్‌యార్డులో పసుపు కొనుగోళ్లను నిలిపివేయనున్నారు. సదరు గిడ్డంగిలో పసుపు, వేరుశనగ, నువ్వులు, పొద్దుతిరుగుడు పంటల కొనుగోలు లావాదేవీలను మాత్రమే కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నారు. తమ డిమాండ్ నెరవేర్చే వరకు పసుపు కొనుగోళ్లను చేపట్టేది లేదంటున్నారు.


కడప మార్కెట్ యార్డు

సమస్య పరిష్కారమయ్యే వరకు నిలిపివేత

తాము ఫిర్యాదు చేసిన పసుపు యార్డులోని 16/329 గిడ్డంగి సమస్య పరిష్కారం అయ్యేంత వరకు యార్డులో పసుపు కొనుగోళ్లు చేపట్టేది లేదని పసుపు వ్యాపారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.రామకృష్ణారెడ్డి, కోశాధికారి గుర్రంకొండ మహేశ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం నుంచి పసుపు కొనుగోళ్లను నిలుపుదల చేస్తున్నామన్నారు.

ఎక్కడికక్కడ నిర్బంధం

● అంగన్వాడీల చలో విజయవాడ భగ్నానికి ప్రభుత్వం యత్నం ● ఎక్కడికక్కడే అంగన్వాడీ కార్యకర్తల అరెస్టు

రాయచోటి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీల చలో విజయవాడ కార్యక్రమాన్ని పోలీసులు భగ్నం చేశారు. ఎక్కడికక్కడ వారిని అరెస్టు చేశారు. న్యాయమైన తమ సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న ఆందోళనలకు ప్రభుత్వం స్పందించకపోవడంతో ఈనెల 22న చలో విజయవాడ కార్యక్రమానికి అంగన్వాడీలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని భగ్నం చేసేందుకు ప్రభుత్వం ముమ్మరంగా ప్రయత్నిస్తోంది. జిల్లా వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో విజయవాడకు తరలివెళుతున్నారనే సమాచారంతో ఎక్కడికక్కడే అంగన్వాడీ యూనియన్ లీడర్లు, అంగన్వాడీల ఉద్యమానికి మద్దతు తెలుపుతున్న సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. విజయవాడకు వెళ్లకుండా ఆర్టీసీ బస్సులను, రైళ్లను తనిఖీ చేశారు. అక్కడ ఉన్న వాళ్లను అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల అంచనా ప్రకారం జిల్లా నుంచి సుమారు 300 మంది వరకు విజయవాడకు బయలుదేరారు. దీంతో ఆదివారం ఉదయం నుంచి అంగన్వాడీ కార్మికుల ఇళ్లు, దీక్షా శిబిరాల వద్దకు పోలీసులు వెళ్లి స్టేషన్‌కు పిలిపించారు. చలో విజయవాడకు అనుమతి లేదని.. వెళితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అయినా కొందరు పోలీసుల కళ్లుగప్పి చలో విజయవాడకు తరలివెళ్లారు. రాయచోటి జిల్లా కేంద్రంలో పలువురు అంగన్వాడీ యూనియన్ క్రియాశీల నాయకురాళ్లను అరెస్టు చేశారు. మదనపల్లె, సీటీఎం రైల్వే స్టేషన్‌లో అంగన్వాడీ కార్యకర్తలను విజయవాడకు వెళ్లకుండా అడ్డుకున్నారు. రాజంపేట, రైల్వేకోడూరులలో కూడా అంగన్వాడీలను విజయవాడకు వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. ఆదివారం జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీలు ఆందోళనలు కొనసాగించారు. రాయచోటి కలెక్టరేట్ ఎదుట అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో 41వ రోజు ఒంటికాళ్లపై నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి పనికి తగ్గ వేతనం కల్పించేందుకు పోరాటం ఆగదని వారు పేర్కొన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు నెరవేర్చేంతవరకు వెనక్కి తగ్గేది లేదని వారు స్పష్టం చేశారు. రాజంపేటలో 41వ రోజు ఆందోళనలు కొనసాగాయి. ఆందోళనల్లో అంగన్వాడీ నాయకురాలు ఈశ్వరమ్మ, విజయ, జ్యోత్స్న, శివరంజని తదితరులు పాల్గొన్నారు. వాల్మీకిపురం ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ అనుబంధ యూనియన్ లీడర్లు చంద్రావతి, భూకైలేశ్వరి, అమ్మాజి తదితరులు పాల్గొన్నారు.


మదనపల్లెలోని సీటీఎం రైల్వేస్టేషన్‌లో అంగన్వాడీలను అడ్డుకుంటున్న పోలీసులు


రాయచోటి కలెక్టరేట్ ఎదుట ఒంటికాళ్లపై నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్వాడీలు

శ్రీరామ రామ రామేతి..

● రాజంపేటలో అట్టహాసంగా సీతారాముల శోభాయాత్ర



రాజంపేట, జనవరి 21: రాజంపేట పట్టణంలో ఆదివారం శ్రీరామ భక్త సేవా సమితి ఆధ్వర్యంలో సీతారాముల శోభాయాత్ర అట్టహాసంగా నిర్వహించారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు, నాయకులు తరలివచ్చారు. వాసవీవనం జమ్మి చెట్టు నుంచి యాత్ర ప్రారంభమై పాతబస్టాండు, ఆర్అండ్‌బీ బంగ్లా, నూనెవారిపల్లె, ఆర్ఎస్ రోడ్డు మీదుగా ఈ కన్నులపండువగా శోభాయాత్ర సాగింది. కార్యక్రమంలో మధ్యప్రదేశ్‌కు చెందిన రాజ్యసభ సభ్యుడు సుమేర్ సింగ్ చోలంకి, ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి, అన్నమాచార్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ చొప్పా యల్లారెడ్డి, టీడీపీ రాజంపేట పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాగోతు రమేశ్‌నాయుడు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్, విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర నాయకులు కాకర్లరాముడు, రాజంపేట మండల టీడీపీ అధ్యక్షుడు గన్నె సుబ్బనరసయ్యనాయుడు, జిల్లా కార్యదర్శి నాగమునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. సామూహిక ఆర్యవైశ్య వివాహ సంస్థ ప్రతినిధులు, ఇస్కాన్ భక్తబృందం, శ్రీవారి భక్త సేవా సమితి సభ్యులు, విద్యామందిరం విద్యార్థులు, భక్త బృందాలు, విశ్వహిందూ పరిషత్ సభ్యులు, భజరంగదళ్ సభ్యులు పెద్దఎత్తున పాల్గొన్నారు. శోభాయాత్ర ఆద్యంతం శ్రీరామనామ స్మరణలు, కోలాటాలు, భక్తబృంద హరినామ స్మరణలతో సాగింది.


శోభాయాత్రలో సీతారామలక్ష్మణులు


రాజంపేట శోభాయాత్రలో పాల్గొన్న రాజంపేట టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు


శోభాయాత్రలో కర్రసాము చేస్తున్న మోదుగుల పెంచలయ్య

క్రీడలు ప్రతి ఒక్కరికి అవసరం



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన జడ్జి శ్రీదేవి

కడప(రూరల్)జనవరి 21: క్రీడల తో ఆరోగ్యం పొందడంతో పాటు, మానసిక ఒత్తిడిని అధిగమించవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి తెలిపారు. కడప నగరం పక్కీరు పల్లెలోని పీవీఆర్ స్పోర్ట్స్ కోచింగ్ సెంటర్‌లో న్యాయమూర్తులకు, న్యాయవాదులకు, న్యాయశాఖ ఉద్యోగులకు నిర్వహిస్తున్న బ్యాడ్మింటన్ పోటీలను ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సులో జడ్జి మాట్లాడుతూ విధి నిర్వహణలో తీరిక లేకుండా కొనసాగుతున్న న్యాయమూర్తులకు, న్యాయవాదులకు, న్యాయశాఖ ఉద్యోగుల్లో బ్యాడ్మింటన్ పోటీలు నూతనోత్తేజాన్ని నింపుతాయన్నారు. ఈ పోటీలలో వయసుతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరు ఉత్సాహంగా పాల్గొనడం సంతోషదాయకమన్నారు. విజేతలకు రిపబ్లిక్ డే సందర్భంగా బహుమతి ప్రదానం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి గీత, ఇతర న్యాయమూర్తులు ఇంతియాజ్ అహమ్మద్, ఎస్. బాబాపక్రుద్దీన్, ఎం. ప్రదీప్‌కుమార్‌లతో పాటు పలువురు న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం


మాట్లాడుతున్న నాగమునిరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), జనవరి 21: పెన్షనర్ల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట ప్రభుత్వం విఫలమైందని ప్రభుత్వ రాష్ట్ర పెన్షనర్ల అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఆదివారం గుంటూరులో రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నాగామునిరెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంటు కృష్ణ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ ప్రభుత్వం అమలు చేసిన పీఆర్సీలో మాత్రమే పెన్షనర్లకు ఉన్న వసతులు తగ్గించడం జరిగిందన్నారు. వీటిని తిరిగి పొందుపరచాలని డిమాండ్ చేశారు. దీనిపై రాష్ట్ర కార్యవర్గం ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

30 నుంచి బ్రహ్మంగారి దేవస్థానంలో హక్కుల వేలం

బ్రహ్మంగారిమఠం, జనవరి 21: జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవస్థానంలో జనవరి 30, 31 తేదీల్లో వివిధ రుసుములు వసూలు చేసుకునే హక్కులను వేలం వేస్తున్నట్లు ఫిట్ పర్సన్ సి.శంకరబాలాజీ ఓ ప్రకటనలో తెలిపారు. కొబ్బరి చిప్పలు వసూలు హక్కునకు రూ.3.50 లక్షలు, పోలేరమ్మ వద్ద టెంకాయలు అమ్ముకునే హక్కుకు రూ.లక్ష, పోలేరమ్మ వద్ద కొబ్బరి చిప్పల సేకరణ హక్కులకు రూ.75వేలు, మరుగుదొడ్ల నిర్వహణకు రూ.75వేలు, మఠంలో మరుగుదొడ్ల నిర్వహణకు రూ.50వేలు, పాదరక్షల భద్రపరిచే హక్కు రూ.50వేలు, డార్మిటరీ హాలు లాకర్ టీటీఈ వసూలు హక్కుకు రూ.లక్ష, తలవెంట్రుకల సేకరణకు రూ.25 లక్షలు ధరావతు డీడీ రూపంలో కానీ, నగదు రూపంలో కానీ చెల్లించి, వివరాలు నమోదు చేసుకుని వేలంలో పాల్గొనాలని పేర్కొన్నారు. ఆయా హక్కులు ఒక సంవత్సరం పాటు ఉంటాయని వివరించారు.

ఉర్దూ ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేయాలి

కడప (ఎడ్యుకేషన్), జనవరి 21 : త్వరలో ప్రకటించనున్న డీఎస్సీలో ఉర్దూ ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని రూటా వ్యవస్థాపక అధ్యక్షుడు సయ్యద్ హిదయతుల్లా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి అసదుల్లా డిమాండ్ చేశారు. ఆదివారం రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ గౌస్‌లాజంను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఐదేళ్లుగా ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులు లేక ఉర్దూ మీడియం విద్యార్థులు ఎంతగానో నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోవు డీఎస్సీలో అయినా ఖాళీలను భర్తీ చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సత్తార్‌ఫైజి, సిరాజుద్దీన్, మహ్మద్ ఆయుబ్, జుబేర్ అహ్మద్, యూనస్, తయ్యబ్ పాల్గొన్నారు.

ఘనంగా అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

మదనపల్లె, జనవరి 21: మదనపల్లె రూరల్ మండలం వేంపల్లె ఎస్సీ కాల నీలో ఆదివారం బారత రాజ్యాంగ ని ర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్ర హావిష్కరణ ఘనంగా నిర్వహించారు. భారతీయ అంబేడ్కర్ సేన(బాస్)తో కలిసి ఎస్సీ కాలనీవాసులు విగ్రహావి ష్కరణ మహోత్సవం నిర్వహించారు. మదనపల్లె ఎమ్మెల్యే నవాజ్ బాషా, డీఎస్పీ కేశప్ప, బాస్ వ్యవస్థాపకుడు పీటీఎం శివప్రసాద్, విగ్రహ కమిటీ చైర్మన్ చాట్ల బయన్న, బాస్ కోశాధికారి నీరుగట్టి రమణ, చీకిలబైలు బాబురెడ్డిలు విగ్ర హాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవాజ్‌బాషా మాట్లాడుతూ గొప్ప రాజ్యాంగాన్ని అంబేడ్కర్ అందించారన్నారు. డీఎస్పీ కేశప్ప మాట్లాడుతూ అంబేడ్కర్‌ను ప్రతి ఒక్కరు గౌరవించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అదేమ్మ, ఎంపీటీసీ సుభారా ణి, కౌన్సిలర్ రేణుకమ్మతో పాటు విగ్రహ కమిటీ సభ్యులు వెంకటరమణ, సురేష్, కళ్యాణ్, రెడ్డి, సురేష్, బాబు, జయప్రకాష్, వెంకటేష్, బాస్ నాయకులు లక్ష్మీనారా య ణ, రెడ్డిప్రసాద్, సూరి, శశికుమార్, పీర్‌బాషా, రత్నం, రాజేష్ పాల్గొన్నారు.


వాల్మీకులు సమైక్య పోరాటాలకు సిద్ధం కావాలి


మాట్లాడుతున్న పులిశ్రీనివాసులు

మదనపల్లె అర్బన్, జనవరి 21: వాల్మీకులు సమైక్య పోరాటాలకు సిద్ధం కావాలని ఆసంఘం వ్యవస్థాపకుడు పులి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఈ నెల 28న మదన పల్లెలో వాల్మీకి సంఘం కార్యాలయం ప్రారంభోత్సవానికి వాల్మీకి కుటుంబసభ్యులు తరలిరావాలని ఆయన కోరారు. ఆదివారం స్థానిక వాల్మీకినాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పులి శ్రీనివాసులు మాట్లాడుతూ వాల్మీకుల విద్య, వైద్య, ఉపాధి, సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాం స్కృతికంగా చైతన్యం తీసుకు రావాలంటే వాల్మీకుల ఐక్యంగా పోరాటాలు చేయాలన్నారు. ప్రభుత్వాలు, ప్రజా ప్రతినిధుల మెడలువంచి వాల్మీకికు ఎస్టీ పునర్ధరణ చేయడానికి ప్రతి ఒక వాల్మీకి నడుము బిగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వాల్మీకి నాయ కులు సద్దల జయసింహా, వలసల మంజునాథ్, నరసింహులు, నిర్మలమ్మ, శ్రీనివాసులు, అర్జున్, రమణ, జయరామ్, నాగరాజ, తదితరులు పాల్గొన్నారు.

మిర్చి పైరుకు బింగి.. రైతుకు బెంగ

● దారుణంగా పడిపోయిన దిగుబడులు.. ● కోత కూలీలు దక్కని వైనం.. ● తీవ్రంగా నష్టపోయిన అన్నదాత


పుల్లీడు గ్రామంలో రాశిగా పోసిన పండుమిర్చి


బింగి తెగులు సోకిందని చెబుతున్న మహిళా రైతు లక్షుమ్మ

పోరుమామిళ్ల, జనవరి 21: వాణిజ్య పంటలు సాగు చేస్తే నాలుగు రూకలు చేతికంది తమ కష్టాలు దూరమవుతాయని ఆశించిన రైతులకు అకాల వర్షాలు, తెగుళ్ల వెన్ను విరిచాయి. పోరుమామిళ్ల వ్యవసాయ డివిజన్‌లో దాదాపు వెయ్యి ఎకరాల్లో, చిన్నపుల్లీడు, పెద్దపుల్లీడు గ్రామాల్లోనే వంద ఎకరాలకు పైగా, దమ్మనపల్లె, గానుగపెంట, గురప్ప గారిపల్లెల్లో 200 ఎకరాల దాకా సాగు చేశారు. ఎకరాకు దాదాపు లక్ష నుంచి లక్షా 20వేల వరకు పెట్టుబడి పెట్టారు. ఎకరాకు 20 క్వింటాళ్ల దాకా దిగుబడి వస్తుందని ఆశించారు. అయితే, పంటకు బింగి తెగులు సోకడంతో కొన్ని ప్రాంతాల్లో పది క్వింటాళ్లు కూడా దిగుబడి వచ్చే పరిస్థితి కనిపించడంలేదు. మరికొన్ని పొలాల్లో పంట కోసిన కూలీలకు కూడా డబ్బులు రావని భావించి అలాగే వదిలేశారు.

పుల్లీడు గ్రామంలో లక్షుమ్మ కుమారులు మూడు ఎకరాల్లో పండు మిర్చి సాగు చేస్తే బింగి తెగుళ్ల కారణంగా చెట్లు ముడుచుకు పోవడం, మిర్చి రంగు మారడంతో ఆందోళన చెందుతున్నారు. ఎన్ని మందులు వాడినా ఈ తెగుళ్ల ఉధృతి తగ్గించలేకపోతున్నామని ఆ వృద్ధురాలు వాపోయింది. చిన్న పుల్లీడుకు చెందిన బాలిరెడ్డి ఐదెకరాల్లో దాదాపు రూ.5ల క్షలకు పైగా పెట్టుబడి పెట్టి మిర్చి సాగు చేస్తే కూలీలకు కూడా డబ్బులు వచ్చే పరిస్థితి లేదని అందుకే అలాగే పంటను వదిలేశామన్నారు. మద్దిరెడ్డి అనే రైతు ఎకరా పొలంలో లక్షకు పైగా పెట్టుబడి పెట్టి మిర్చి సాగు చేస్తే కూలీలు కూడా రావని భావించి అలాగే వదిలేసినట్లు తెలిపారు. త్వరలో ఈ పంటలు దుక్కి దున్ని టిల్లర్ కొట్టాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఉద్యానశాఖ అధికారి శ్రీనివాసరెడ్డిని వివరణ కోరగా, మూడేళ్లుగా మిర్చికి తెగుళ్ల సోకుతున్నాయని రైతులు కాంప్లెక్స్ ఎరువులు వాడకుండా ప్రైవేటు కంపెనీ వారు చెప్పిన మందులు వాడడం వల్ల తెగుళ్లను నియంత్రించలేకపోతున్నామన్నారు. ఉద్యానశాఖాధికారుల సంప్రదించి వారి సలహాలు పాటిస్తే తెగళ్లను కాస్త నివారించవచ్చన్నారు. ప్రస్తుతం క్వాలిటీ బట్టి మిర్చికి రూ.16వేల నుంచి రూ.22వేల వరకు ధర పలుకుతోందన్నారు.

'అమ్మఒడి పేరుతో పన్నుల బాదుడు'


సంఘీభావం తెలుపుతున్న బీసీ నాయకులు

కడప (మారుతీనగర్), జనవరి 21: అమ్మఒడి పేరుతో వైసీపీ ప్రభుత్వం పన్నుల రూపంలో అన్ని వర్గాల ప్రజల నడ్డి విరుస్తోందని ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధృఢం రెడ్డిబాబు ధ్వజమెత్తారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి జరిగిన అన్ని సార్వత్రిక ఎన్నికల్లో బీసీ వర్గాలకు రాజకీయ ప్రాధాన్యం దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అతికొద్ది మంది జనాభా గల అగ్రవర్ణాల చేతుల్లో రాజ్యాధికారం బందీ అయిందన్నారు. నేటికీ ఎక్కువ జనాభా గలిగిన వర్గాలు పల్లకీలు మోసే బోయీలుగా అగ్రవర్ణాల అహంకార మదానికి బలవుతున్నారన్నారు. జనాభా దామాషాప్రకారం చట్టసభల్లో 54 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, దేశ వ్యాప్తంగా కుల జన గణన చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కళాక్షేత్రంలో నిర్వహించిన బీసీ గర్జన కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు జి.లక్ష్మిరెడ్డి, అమీర్ బాబు, కడప టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాధవీరెడ్డి, నాయకుడు కత్తి రవీంద్ర, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణయాదవ్ మాట్లాడారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విద్యుత్ పన్ను, కరెంటు పన్ను, చెత్త పన్ను, ఆటోలపై రిజిస్ట్రేషన్ బాదుడు, పెట్రో,డీజలు, గ్యాస్ ధరల పెంపుతో ప్రజలు తీవ్ర నరకయాతన పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్క చాన్స్ పేరుతో ప్రజలను బురిడీ కొట్టించి, అధికారం చేపట్టగానే పన్నుల బాదుడుతో ప్రజలకు ప్రత్యక్షంగా నరకం చూపిస్తున్నారని ధ్వజమెత్తారు. ముఖ్యంగా భవన నిర్మాణ కార్మికులు పనులు లేక వలస పోతున్నారని, వీరితో పాటు నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఇతర రాష్ట్రాలకు తరలుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ బడుల్లో సరైన విద్యాబోధన లేక ప్రైవేటు పాఠశాలల్లో చదివిద్దామంటే ఫీజులు కట్టలేక పేదలు ఇబ్బందులుపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదాయం, అభివృద్ధి లేకపోవడంతో ప్రజలు సతమతమవుతున్నారని విచారం వ్యక్తం చేశారు. రాజకీయ నాయకులేమో లక్షలాది రూపాయలు జీతాలు తీసుకుంటూ ప్రభుత్వ స్థలాలు కబ్జా చేయడమే పనిగా పెట్టుకుని వారి ఆదాయ వనరులను పెంచుకుంటున్నారే తప్ప ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. బీసీ-ఏలో ఉన్న కులాలకు ఎస్టీ హోదా కల్పించాలన్నారు. అలాగే బీసీ-డిలో ఉన్న కులాలను బీసీఏలోకి చేర్చాలన్నారు. జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ కల్పించాలని, క్రిమిలేయరు ఎత్తివేయాలని, చేనేత కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలన్నారు. లేనిపక్షంలో వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బీసీల సత్తా ఏంటో రుచి చూపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ టీడీపీ కార్యదర్శి సుంకర నాగేశ్వర్ రావు, ఏపీ బీసీ మహాసభ జాతీయ కన్వీనరు అవ్వారు మల్లికార్జున, శ్రీనివాసులు, బీజేపీ నాయకులు బాలకృష్ణయాదవ్, సంఘం సేవకులు సలావుద్దీన్, దళిత నాయకులు సంగటి మనోహర్‌తో పాటు పలువురు ఏపీ బీసీ సంక్షేమసంఘం నాయకులు పాల్గొన్నారు.ట

ఆశ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



మాట్లాడుతున్న సుబ్బరాయుడు

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 21 : రాష్ట్ర ప్రభుత్వం ఆశ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి వి.సుబ్బరాయుడు తెలిపారు. ఆదివారం పద్మశాలీయ కల్యాణ మండపంలో ఆశ వర్కర్ల జిల్లా స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ వర్కర్లు మాతా శిశుమరణాల నివారణకు ఎంతగానో కృషి చేస్తున్నారని తెలిపారు. కరోనా సమయంలో వారు ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించినా, ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, వారి శ్రమను దోచుకుంటోందని విమర్శించారు. ఆశ వర్కర్ల వేతనాలు కూలీల వేతనం కన్నా తక్కువ అని, చాలీచాలని వేతనాలతో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం వారికి సామాజిక భద్రత కల్పించి కనీస వేతనాలు చెల్లించాలని కోరారు. హక్కుల కోసం ఉద్యమిస్తే ఎస్మా చట్టం పేరుతో బెదిరిస్తోందని తెలిపారు. తమ సమస్యల పరిష్కారానిక్లి భవిష్యత్తు పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్.శాంతి మాట్లాడుతూ ఆశ వర్కర్లను పర్మనెంట్ చేసి రూ.26వేలు వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. సెలవులు కూడా ఇవ్వకుండా ప్రభుత్వం వారితో వెట్టి చాకిరీ చేయించుకుంటోందని విమర్శించారు. కనీస వేతనంతోపాటు రిటైర్మెంట్ ప్రయోజనం రూ.5లక్షలు, గ్రాట్యుటీ, రూ.10వేలు పెన్షన్ చెల్లించాలని డిమాండ్ చేశారు. మరణించిన ఆశ వర్కర్లకు రూ.10లక్షల ప్రభుత్వ బీమా, వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఈ సదస్సులో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, జిల్లా కార్యదర్శి శ్రీరాములు, చంద్రశేఖర్, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్పన, సునంద, అమ్ములు, రమణమ్మ, మంజులవాణి, శోభారాణి, సరళ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

సోషలిస్టు సమాజాన్ని పరిచయం చేసిన మహనీయుడు లెనిన్


లెనిన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఐనాయకులు

మదనపల్లె అర్బన్, జనవరి 21: ప్రపంచానికి సోషలిస్టు సమాజాన్ని పరిచయం చేసిన మహనీయుడు వీఐ లెనిన్ అని సీపీఐ నాయకులు అన్నారు. ఆదివారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో ప్రపంచ విప్లవ కారుడు లెనిన్ శత జయంతి ఉత్సవాలను మదనపల్లె నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. లెనిన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి పీ ఎల్‌నరసింహులు మాట్లాడుతూ ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ మానవ మనుగడకే ప్రమాదమని. ఇది కొనసాగినన్ని రోజులు దోపిడీ కొనసాగుతుందని తెలియజేశారు. ఈ సమాజం మారితేనే శ్రామిక ప్రజలకు దోపిడీ నుంచి విముక్తి లభిస్తుందన్నారు. రష్యా పెడరేషన్‌లో మార్క్సిస్టు విప్లవపోరాటంతో శ్రామిక పోరాటాన్ని నడిపి సోషలిస్టు సమాజాన్ని స్థాపించారన్నారు. ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడిదారీ సమాజం రెండు శతాబ్దాలు పయనించిన నేటికి పేదరికం, ఆర్థిక అసమానతలు, నిరుద్యోగం తొలగిపోలేదన్నారు. మనదేశంలో కుల, మతాలపై రాజకీయాలు చేస్తూ మనుష్యుల మధ్య విభేదాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మహిళసంఘం జిల్లా కార్యదర్శి సుమిత్రమ్మ, ఏఎస్ఎంల సంఘం రాష్ట్ర నాయకురాలు లీలావతి, సిపీఐ నియోజకవర్గ కార్యదర్శి మురళి, తిరుమల, దేవ, సూరి, రెడ్డి, శోభ, ఏఐఎస్ఎఫ్ నాయకులు శీన, నవీన్, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

బావిలో దూకి మహిళ ఆత్మహత్య

చెన్నూరు, జనవరి 21 : జీవితంపై విరక్తితో ఓ మహిళ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది.

మండలంలోని కనుపర్తికి చెందిన వరలక్ష్మి (57) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో విరక్తి చెందిన ఆమె ఆదివారం మధ్యాహ్నం గ్రామ సమీపంలోని బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఆ మహిళ బయటికి వెళ్లే సమయంలో స్థానికులు ఆమెను గమనించారు. అయిత పొలం వద్దకు వెళుతోందనుకుని మిన్నకుండిపోయారు. కాగా, కొందరు మహిళలు ఆమె బావిలో దూకడాన్ని దూరం నుంచి గమనించి, అక్కడికి వచ్చే లోగానే ఆమె మృతి చెందింది. వారు అందించిన సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు.

వాహనాల తనిఖీల్లో రూ.22 లక్షలు స్వాధీనం

బద్వేలు టౌన్, జనవరి 21 : పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో ఆదివారం అర్బన్ పోలీసులు వాహనాల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వేపరాల గ్రామానికి చెందిన సుబ్బరాయుడు అనే వ్యక్తి వాహనంలో రూ.8లక్షలు, తమిళనాడు రాష్ట్రం తగ్గట్టి గ్రామానికి చెందిన రాజముహి అనే వ్యక్తి వాహనంలో రూ.14 లక్షలు నగదు గుర్తించారు. ఈ నగదుకు సంబధించి ఎలాంటి బిల్లులు, పత్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఓబులవారిపల్లె, జనవరి 21: కారు ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారుడు గాయాలపాలయ్యాడు. పెద్దఓరంపాడు గ్రామ పంచాయతీ బెస్తపల్లె అరుంధతివాడకు చెందిన సురేంద్రబాబు (55) ద్విచక్ర వాహనంపై వెళుతుండగా, చిన్నఓరంపాడు ముక్కావారిపల్లె మధ్యలో కారు ఢీకొంది. దీంతో ఆయన మణికట్టు విరగడంతోపాటు తలకు గాయాలైనట్లు 108 సిబ్బంది తెలిపారు. క్షతగాత్రుడిని రైల్వేకోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి

సుండుపల్లె, జనవరి 21: మామిడి తోటలో మేతకు వెళ్లిన ఓ ఆవు ఆదివారం విద్యుత్ తీగలు తగిలి మృతి చెందింది. తమను ఆదుకోవాలని ఆవు యజమాని ముడుంపాడు గ్రామ పంచాయతీ ఆరోగ్యపురం బిడికీ వాసి బాలాజీనాయక్‌కు అధికారులను కోరుతున్నాడు. ఈ విషయం పశుసంవర్ధకశాఖ అధికారి విజయ్‌కిరణ్ దృష్టికి తీసుకెళ్లగా ప్రభుత్వం నుంచి ఎటువంటి నష్టపరిహారం రాదని తెలిపారు. గతంలో పాడి ఆవు చనిపోతే రూ.20 వేలు నష్టపరిహారం చెల్లించేదన్నారు. ప్రస్తుతం ఆ పథకం ప్రభుత్వం తొలగించడంతో నష్ట పరిహారం అందదని వివరించారు.

బకాయిల చెల్లింపులో అలసత్వం తగదు

● యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, జాబీర్



మోకాళ్లపై నిరసన తెలుపుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు

రాయచోటిటౌన్, జనవరి 21: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు సంబంధించి బకాయిలను చెల్లించడంలో ప్రభుత్వం మొండి వైఖరి సరైనది కాదని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, జాబీర్ అవేదన వ్యక్తం చేశారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని నేతాజీ సర్కిల్ వద్ద ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లు మోకాళ్లపై నిలబడి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు సంబంధించి పీఆర్సీ బకాయిలు, డీఏ అరియర్లు, సరెండర్ లీవ్ బకాయిలు, ఏపీ జీఎల్ఐలోన్లు, ఫైనల్ పేమెంట్లు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లుల చెల్లింపులకు సంబంధించిన ఉత్తర్వులు విడుదల చేసినా, వేలాది కోట్ల రూపాయలు ఇంకా చెల్లించకపోవడం బాధాకరమన్నారు. ఈ విషయంపై పలుసార్లు వివిధ రూపాల్లో ఆందోళన చేసిన ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని వారు విమర్శించారు. 11వ పీఆర్సీకి సంబంధించిన బకాయిలే పెండింగ్ ఉండగా, ఆర్భాటంగా 12వ పీఆర్సీ వేశారే తప్ప ఆ కమిటీ విధి విధానాలు రూపొందించకపోవడం, వారు తమ కార్యకలాపాలు కొనసాగించడానికి తగిన ఏర్పాట్లు చేయకపోవడం ఉద్యోగ, ఉపాధ్యాకులను మోసం చేయడం తప్ప మరోటి కాదన్నారు. ఇప్పటికైనా బకాయిలు స్నింటినీ చెల్లించి, 30 శాతం ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేకపోతే డిమాండ్లు నెరవేరే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షులు హేమలత, జిల్లా కోశాధికారి చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శులు అక్రమ్ బాషా, భాస్కర్‌రెడ్డి, పురం వెంకట్రమణ, దావూద్, ఆదినారాయణ, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ సురేంద్రారెడ్డి, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు మస్తానయ్య, రమణయ్య, అజ్మతుల్లా, నీలేశ్, సంకా ప్రసాద్, సుబ్రమణ్యం, రాయచోటి మండల ప్రధాన కార్యదర్శి రాజారమేశ్, మండల సహాధ్యక్షులు పఠాన్ రఫీఖాన్, చిన్నమండెం మండలం సహాధ్యక్షుడు కిఫాయతుల్లా తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి భస్మాసురుడుగా మారిన జగన్‌రెడ్డి

● మాజీ ఎమ్మెల్యే విజయమ్మ ● వైసీపీ నుంచి వంద కుటుంబాలు టీడీపీలో చేరిక


వైసీపీ నుంచి టీడీపీలో చేరిన కుటుంబాలు

బద్వేలు టౌన్, జనవరి 21 : ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రానికి భస్మాసురుడులా మారాడని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త రితీష్ కుమార్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని చెన్నంపల్లెలో వైసీపీ నుంచి వంద కుటుంబాలు టీడీపీలో చేరాయి. వారిని విజయ మ్మ, రితీష్‌కుమార్‌రెడ్డిలు టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలకు ఆకర్షితులై వారు టీడీపీలో చేరారన్నారు. జగన్ సీఎం అయినప్పటి నుంచి నిరంకుశ పాలనతో రాష్ట్రం అధోగతి పాలైందని దీంతో వ్యవస్థలు సైతం దెబ్బతిన్నాయన్నారు. అన్నివర్గాల ప్రజలు వైసీపీ పాలనలో విసిగిపోయాయని వారు తెలిపారు. ఒక్క చాన్స్ అంటూ సీఎం పీఠం ఎక్కిన జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడన్నారు. వైసీపీ అరాచక పాలనను రాబోవు ఎన్నికల్లో వైసీపీని ఇంటికి పంపాలన్నారు. మన రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని, ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేసి టీడీపీ విజయంలో భాగం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బద్వేలు పట్టణ అధ్యక్షులు వెంగల్ రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు నరసింహ నాయుడు, చెన్నక్రిష్ణరెడ్డి, ఈగ సుబ్బారెడ్డి, వెంకటసుబ్బయ్య, శివయ్యస్వామి, చరణ్, కుమార్, వెంకటరమణ, పెంచలయ్య, ప్రసాద్‌నాయుడు, సుధాకర్, మాచుపల్లె లక్ష్మీదేవి పాల్గొన్నారు.

పాత కక్షలతో దాడి

మదనపల్లె టౌన్, జనవరి 21: పాతకక్షలతో ఓ వ్యక్తిపై ఇద్దరు దాడి చేశారు. బాధితుని కథనం మేరకు.. మండలంలోని సీటీ ఎం-1 పంచాయతీ పడమట వీధికి చెందిన రఘునాథరెడ్డి కుమారుడు సుదర్శన్‌రెడ్డి(35) శనివారం రాత్రి వీధిలో వెళుతుండగా వెనక నుంచి కర్రలతో దాడి చేసి పారిపోయారు. బాధితుడు ఆదివారం ఉదయం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స చేయించుకున్నాడు. వినాయచవితి సందర్భంగా జరిగిన వాగ్వాదంతో తనపై కక్ష పెంచుకుని హుస్సేన్, కాలేషా దాడి చేశారని తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేస్తానని చెప్పాడు.

కాంగ్రెస్ పార్టీని విమర్శించే నైతికత కమలాపురం ఎమ్మెల్యేకు లేదు

● కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గుండ్లకుంట శ్రీరాములు


మాట్లాడుతున్న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు జి. శ్రీరాములు

కడప(కలెక్టరేట్), జనవరి 21: కాంగ్రెస్ పార్టీ హయాంలో జడ్పీ వైస్ చైర్మన్, మేయర్ లాంటి పదవులు పొందిన కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డికి తల్లి లాంటి ఆ పార్టీని విమర్శించే నైతిక హక్కు లేదని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గుండ్లకుంట శ్రీరాములు విమర్శించారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నగర అధ్యక్షుడు విష్ణుప్రీతంరెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీసీసీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పర్యటనను విజయవంతం చేసిన ప్రతి కాంగ్రెస్ కార్యకర్త, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి వస్తున్న ఆదరణ చూసి కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డి కాంగ్రెస్‌ను విమర్శించడం అర్థ రహితమన్నారు. కాంగ్రెస్ పార్టీలోనే నీ రాజకీయ ప్రస్థానం సాగిందనే విషయాన్ని మరిచి పోవద్దన్నారు. తల్లి పాలు తాగి రొమ్ము గుద్దినట్లుగా కాంగ్రెస్‌ను తక్కువ చేసి మాట్లాడవద్దన్నారు. మరో 10 రోజుల్లో పీసీసీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలమ్మ జిల్లా పర్యటన ఉంటుందని, ప్రతి కార్యకర్తను ,నాయకులను కలుస్తారన్నారు.

ఈ కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ పొట్టి పాటి చంద్ర శేఖర్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షుడు అలీఖాన్, ధ్రువకుమార్‌రెడ్డి, పాలగిరి శివ,సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పసుపులేటి శివశంకర్‌కు ఆహ్వానం

నందలూరు, జనవరి 21: శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం న్యాయశాఖ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 25న జరిగే కార్యక్రమానికి రాజంపేట స్పెషల్ జ్యూడీషియల్ మెజిస్ట్రేట్ డాక్టర్ పసుపులేటి శివశంకర్‌ను ప్రధాన వక్తగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ ఓటరు దినోత్సవం, ముందస్తు భారత జాతీయ గణతంత్ర దినోత్సవాలను పురస్కరించుకొని లా డిపార్ట్‌మెంటు హెడ్ డాక్టరు ఆదినారాయణ ఆహ్వానం అందించినట్లు తెలిపారు. తిరుపతి వెంకటేశ్వర విశ్వవిద్యాలయం న్యాయశాఖ విభాగం ఆధ్వర్యంలో లా పీజీ డిపార్టుమెంటు సెమినార్ హాలులో జనవరి 25న జరిగే సమావేశంలో ఓటు హక్కు అనే అంశం మీద ప్రసంగించనున్నట్లు తెలిపారు.

గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం

ఓబులవారిపల్లె, జనవరి 21: మండలంలోని చిన్నఓరంపాడు గ్రామ పంచాయతీలో మెరుగైన వైద్య చికిత్సలు అందించేందుకు తిరుపతి నుంచి ప్రత్యేక వైద్యులను పిలిపించారు. నిర్వాహకుడు ఓరంపాడు ఉపేంద్ర ఆధ్వర్యంలో బీపీ షుగర్, థైరాయిడ్, చర్మ వ్యాధులు, కీళ్ల నొప్పులు వంటి రోగులకు తక్కువ ఖర్చుతో వైద్య చికిత్సలు అందించేందుకు డాక్టర్ దొమ్మరాజు జీవన్‌కుమార్‌ను ఆహ్వానించినట్లు తెలిపారు. అలాగే గ్రామీణులకు ప్రతినిత్యం అందుబాటులో ఉండేలా ఈసీటీ, ఆక్యూపెన్షర్, నాచురోపతి వంటి వైద్య చికిత్సలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

శ్రీరామ భక్తులకు అన్నదానం



భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్న టీడీపీ నేతలు

రాజంపేట, జనవరి 21: రాజంపేట పట్టణంలో శ్రీరామ భక్తులకు టీడీపీ నేత గంటా నరహరి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలో ఆదివారం సీతారామ శోభాయాత్ర సందర్భంగా పెద్దఎత్తున భక్తులు పాల్గొని తదనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. సుమారు 2 వేల మంది భక్తులకు ఈ అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో రాజంపేట మండల పార్టీ అధ్యక్షుడు సుబ్బనరసయ్యనాయుడు, పార్లమెంటు కార్యదర్శి నాగమునిరెడ్డి, సుభద్ర, ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

ఎస్‌ఐగా బాధ్యతల స్వీకరణ



రామకృష్ణ

సంబేపల్లె, జనవరి 21: సంబేపల్లె సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పి.రామకృష్ణ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ ఎస్‌ఎండీ షరీఫ్ జిల్లా హెడ్‌క్వార్టర్‌కు బదిలీ కావడంతో ఈయన స్థానంలో మదనపల్లె నియోజకవర్గం నిమ్మనపల్లె మండల పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న రామకృష్ణ బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా నూతన ఎస్‌ఐ మాట్లాడుతూ పేకాట, కోడిపందేలు వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు.

నేడు జయహో బీసీ సమావేశం

సంబేపల్లె, జనవరి 21: మండల కేంద్రంలో టీడీపీ ఆధ్వర్యంలో సోమవారం జయహో బీసీ సమావేశం నిర్వహిస్తున్నట్లు మాజీ జడ్పీటీసీ మల్లు నరసారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే రమేశ్‌కుమార్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. మండల పరిధిలోని బీసీ నాయకులతో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు సమావేశానికి హాజరవ్వాలని కోరారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

రాయచోటిటౌన్, జనవరి 21: సంక్రాంతి పురష్కరించుకొని పట్టణంలోని మదనపల్లె రోడ్డులో గల వీఆర్ స్కూల్ సమీపంలో గుది మారుతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ మారుతి ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీల్లో 52 జట్ల క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ క్రికెట్ పోటీల్లో ఫైనల్‌లో అగ్రి ఆర్మీ వాసేస్, సద్దామ్ 11 తలపడగా సద్దామ్- 11 ఫైనల్‌లో ఘన విజయం సాధించి టోర్నమెంట్ విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు గుది నాగార్జున, జ్ఞానేంద్రారెడ్డి, గజ నాయుడుల చేతుల మీదుగా విజేతగా నిలిచిన సద్దార్-11 టీంకు రూ.50,016 నగదుతో పాటు కప్పును అందజేశారు. అలాగే రన్నరప్‌గా నిలిచిన అగ్రీ ఆర్మీ టీంకు రూ.25,116లు నగదుతో పాటు కప్పును అందజేశారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ ఆర్గనైజర్స్ ఫణికుమార్, రాము, అనిల్, వెంకట్రామ, ప్రసాద్, దేరంగుల అనిల్, శ్రీను, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయం తథ్యం

● టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు

వీరబల్లి, జనవరి 21: రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయం తథ్యమని టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు అన్నారు. స్థానిక వీరబల్లి పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌కు ఒక్కసారి అవకాశం ఇచ్చినందుకే రాష్ట్రం అధోగతి పాలవ్వడంతో పాటు అభివృద్ధిలో 30 ఏళ్ల వెనక్కు వెళ్లిందని, ఎన్నికల్లో మరోసారి జగన్‌కు ఓటు వేసి నష్టపోవద్దని ప్రజలకు సూచించారు. నాలుగున్నరేళ్లుగా పాలించి రాష్ట్రాన్ని విధ్వంసం చేశారన్నారు. ఎన్నికల సమయంలో కేవలం మాటలు చెప్పి వాగ్దానాలు అమలు పర్చడంలో విఫలమయ్యారని తెలిపారు. మద్యం నిషేదం చేయకుండా మద్యంతోనే దోపిడీ చేశారన్నారు. చెత్త మీద పన్ను చేయడం, అన్నింటినీ ధరలు పెంచి సామాన్యులపై భారం పెంచారన్నారు. ఎక్కడ చూసినా ల్యాండు, మైనింగ్, శాండ్‌లను దోచుకునే పరిస్థితి ఉందన్నారు. ఎక్కడా ఉద్యోగాలు ఇచ్చిన పరిస్థితి అభివృద్ధి కనిపించలేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు భానుగోపాల్‌రాజు, నారాయలు, రెడ్డెప్పరెడ్డి, దుర్గం ఆంజనేయులు, ఆంజనేయులురెడ్డి, భాస్కర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలి

యువత క్రీడల పట్ల ఆసక్తి చూపడంతో పాటు ప్రాధాన్యత ఇచ్చినప్పుడే దేహదారుఢ్యాన్ని పెంపొందించుకున్న వారవుతాని జగన్‌మోహన్‌రాజు అన్నారు. వీరబల్లిలో జరిగిన అంబేడ్కర్ క్రికెట్ టోర్నీ ముగింపునకు ఆయన ఆదివారం విచ్చేశారు. ఈ సందర్భంగా టోర్నీ విజేతగా నిలిచిన చెందూ లెవెన్ జట్టుకు 20,116 నగదు కప్‌ను, రన్నర్స్‌గా నిలిచిన బలిజపల్లె వారియర్స్ జట్టుకు రూ.10,116 కప్‌ను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడల వల్ల వారి ప్రతిభ బయట పడే అవకాశాలున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు భానుగోపాల్‌రాజు, మట్లి సర్పంచ్ సోమారపు నాగార్జునచారి, మండల నాయకులు రెడ్డెప్పరెడ్డి, భూషయ్యనాయుడు, ఆంజనేయులురెడ్డి, దుర్గం ఆంజనేయులు, భాస్కర్‌రాజు, నిర్వాహకులు రమణ, సురేంద్ర, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రాజు

జగన్ పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గరపడ్డాయి

● రమేశ్‌కుమార్‌రెడ్డి, బాలసుబ్రమణ్యం

గాలివీడు, జనవరి 21: ప్రజా వ్యతిరేక పాలన అందిస్తున్న జగన్ ప్రభుత్వానికి చరమగీతం పాడే రోజులు దగ్గరపడ్డాయని మాజీ ఎమ్మెల్యే, రాయచోటి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి రమేశ్‌కుమార్‌రెడ్డి, రాజంపేట పార్లమెంటరీ టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంలు పేర్కొన్నారు. ఆదివారం గాలివీడు మండల కేంద్రంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధిలో వెనుకబడి ఉన్నదని, దీనికంతటికీ కారణం వైసీపీ ప్రభుత్వం అవలంభించే విధానాలేనని దుయ్యబట్టారు. రాష్ట్రంలో అవినీతి, అక్రమాలు పెరిగిపోయాయని, ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు పెడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటనారాయణరెడ్డి, రాజంపేట పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు మండపాటి రవీంద్రబాబు, పూలుకుంట సర్పంచ్ పార్థసారధిరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు లక్ష్మయ్య, మాజీ వైస్ ఎంపీపీ మోపూరి రమణయ్య, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా, మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ నరసారెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జిలు సత్యారెడ్డి, వెంకటశివారెడ్డి, రాయచోటి రూరల్ అధ్యక్షుడు మురికినాటి సుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, కదిరినాయుడు, ప్రభాకర్‌రెడ్డి, రెడ్డెప్పరెడ్డి, శివప్పనాయుడు పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీల సంక్షేమం

టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు బీసీలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు ఏర్పాటు చేశామని మాజీ ఎమ్మెల్యే, రాయచోటి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి రమేశ్‌కుమార్‌రెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ సుగవాసి బాలసుబ్రమణ్యంలు పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో టీడీపీ బీసీ జయహో సభా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వారు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ రాజంపేట పార్లమెంటరీ బీసీ అధ్యక్షుడు సురేంద్రయాదవ్, రాయచోటి టీడీపీ బీసీ అధ్యక్షుడు వాసు, మాజీ సర్పంచులు ప్రభాకర్‌నాయుడు, భద్రప్పనాయుడు, మహమ్మద్ రియాజ్, మాజీ వైస్ ఎంపీపీ మోపూరి రమణయ్య, మాజీ వక్ఫ్‌బోర్డు మెంబర్ టీఎస్ మహబూబ్‌బాషా, వీరరాఘవులు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



బాబు ష్యూరిటీలో పాల్గొన్న రమేశ్‌రెడ్డి, బాలసుబ్రమణ్యం

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

● గురువులకు సన్మానం



హెచ్‌ఎంఎం హైస్కూలులో కలుసుకున్న పూర్వపు విద్యార్థులు

రైల్వేకోడూరు, జనవరి 21: 1982-1983 బ్యాచ్ పూర్వపు విద్యార్థుల సమ్మేళనం ఆదివారం పట్టణంలోని హెచ్‌ఎంఎం హైస్కూలులో ఘనంగా నిర్వహించారు. మల్లు మహదేవరెడ్డి, నారాయణరావు, ఉంగరాల క్రిష్ణ, మునిక్రిష్ణ, లీలాకర్, ఈశ్వరయ్య, ఉంగరాల వెంకటేష్, ఉంగరాల చంద్రశేఖర్‌ల ఆధ్వర్యంలో పూర్వపు విద్యార్థుల కలయిక జరిగింది. హైస్కూలులో మొదట జాతీయ ప్రార్థన గీతంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. గురువులు పుష్పరాజ్, నరసరాజు, సుబ్బరాయుడు, ప్రభాకర్‌రెడ్డి తదితరులను సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో అప్పటి ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఎక్కడో పుట్టి, ఎక్కడ పెరిగి, ఇక్కడ చదువుకున్న విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాలను మరిచిపోకుండా, ఉపాధ్యాయులను గుర్తు పెట్టుకుని సన్మానించడం సంతోషకరమని తెలిపారు. పూర్వ విద్యార్థులు ఉదయ్‌శంకర్‌రెడ్డి, జయరాం, నారాయణరావు, లీలాకర్, ఉంగరాలక్రిష్ణ తదితరులు మాట్లాడుతూ 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుకున్న సందర్భాలను నెమరువేసుకున్నారు. అనంతరం విందు భోజనం ఏర్పాటు చేశారు. అందరికి మెమెంటోలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సుగవాసి రాజశేఖర్, ఆంజనేయరాజు, విజయకుమార్, విజయ్‌బాబు, విజయ్‌ఖన్నా, శేషయ్యనాయుడు, మల్లు వెంకటరెడ్డి, వెంకటరమణ, రవిశంకర్, గౌరీశంకర్‌రాజు, గడికోట సుబ్బరాయుడు, శైలేష్‌ఖన్నా, ధరణి, భ్రమరవాణి, లక్ష్మీ, నాగవేణి, ఉమ, అనురాధా, శారద తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీకి బీసీలే వెన్నెముక



సమావేశంలో ప్రసంగిస్తున్న మోదుగుల పెంచలయ్య

ఒంటిమిట్ట, జనవరి 21: టీడీపీకి బీసీలే వెన్నెముక అని బలిజ సంఘం మాజీ రాష్ట్ర డైరెక్టర్ మోదుగుల పెంచలయ్య అన్నారు. ఆదివారం ఒంటిమిట్ట మండల బీసీ సమావేశాన్ని సిద్దవటం మండలంలోని కనకదుర్గ కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మండలంలో టీడీపీకి బీసీలు మూలస్తంభాలన్నారు. మండల వ్యాప్తంగా ఉన్న బీసీ సోదరులందరికీ కలుపుకుపోవాలని, టీడీపీని ఎప్పటి నుంచో బీసీలు ఆదరిస్తున్నారని, అలాంటి వారిని గౌరవించాలన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో బీసీ సోదరులతో కలిసి సమావేశాలు ఏర్పాటు చేసి టీడీపీ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఒంటిమిట్ట మండలాన్ని రూ.100 కోట్లతో మాజీ సీఎం చంద్రబాబునాయుడు అభివృద్ధి చేశారని, ఆనాటి అభివృద్ధి ఇప్పటికీ కనబడుతుందన్నారు. రాబోయే ఎన్నికల్లో చంద్రబాబునాయుడును సీఎంగా చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గజ్జల నరసింహారెడ్డి, మండలంలోని బీసీ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఇంటర్నెట్‌ను వాడుకోవాలి

రాజంపేటటౌన్, జనవరి 21: ప్రభుత్వం తక్కువ ధరతో అందిస్తున్న ఇంటర్నెట్ సేవలను అందరూ వినియోగించుకోవాలని రాష్ట్ర ఫైబర్ నెట్ లిమిటెడ్ మార్కెటింగ్ మేనేజర్ రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రాజంపేటలో జరిగిన ఆపరేటర్ల సమావేశంలో మాట్లాడుతూ ఫైబర్ నెట్ ద్వారా ప్రభుత్వం అందజేసే సబ్సిడీ పోనూ రూ.190కే నెట్‌ను ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ సేవలపై మరింత విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు.

పోరాటాలు ఆగవు

● కలెక్టరేట్ వద్ద ఒంటికాలిపై నిరసన

రాయచోటి(కలెక్టరేట్), జనవరి 21: ఎన్ని అక్రమ అరెస్టులు చేసినా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు ఆగవని అంగన్వాడీలు అన్నారు. జిల్లా కలెక్టరేట్ ఎదుట అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో 41వ రోజు వంటికాళ్లపై నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ మొండి వైఖరి విడనాడి పనికి తగ్గ వేతనం కల్పించేందుకు పోరాటం ఆగదన్నారు. అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ నాగేశ్వరి, ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దిగాళ్ల శ్రీనివాసులు, పట్టణ నాయకులు యపరాల పుల్లయ్య, అంగన్వాడీ నాయకురాలు సుజాత, తులసి తదితరులు పాల్గొన్నారు.

రాజంపేటటౌన్: రాజంపేటలో అంగన్‌వాడీ దీక్షలు ఆదివారం కూడా కొనసాగాయి. 41 రోజులు ఆందోళనలో భాగంగా అంగన్‌వాడీ కార్యాలయం ఎదుట కార్యకర్తలు ధర్నా నిర్వహించి తమ సమస్యలు పరిష్కరించాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. 41 రోజులుగా మహిళలు రోడ్డుపైకి వచ్చి ధర్నా చేస్తుంటే ప్రభుత్వానికి చీమకుట్టినట్లైనా లేపోవడం దారుణన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకురాలు ఈశ్వరమ్మ, శివరంజిని, జ్యోత్స్న, విజయ పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె: అంగన్‌వాడీలు తమ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 22 చలో విజయవాడకు రాష్ట్ర అంగన్ వాడీల యూనియన్ పిలుపు మేరకు లక్కిరెడ్డిపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు నుంచి విజయవాడకు వెళ్లనున్నా మని, ముందస్తులో భాగంగా ఆదివారం అంగన్‌వాడీలను అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లినట్లు అంగన్‌వాడీ యూనియన్ లీడర్ల ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి ప్రభావతమ్మ, ఓబులమ్మ శ్రీవాణిలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి ప్రభావమ్మ, శ్రీవాణి, మణి, వెంకటసుబ్బమ్మ, రత్నమ్మలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విజయవాడకు వెళితే అంగన్‌వాడీలపై కేసులు బనాయిస్తామని పోలీసులు బెదిరించినట్లు తెలిపారు. ఎన్ని అరెస్టులు చేసినా అంగన్‌వాడీల సమస్యల కోసం పోరాటాలు చేస్తామని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.



అంగన్‌వాడీలను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లిన పోలీసులు

బాబును గెలిపించండి.. రాష్ట్ర భవిష్యత్తును కాపాడండి

చిట్వేలి, జనవరి 21: బాబును గెలిపించి.. రాష్ట్ర భవిష్యత్తును కాపాడాలని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కస్తూరి విశ్వనాథనాయుడు అన్నారు. మండల పరిధిలోని పోలోపల్లి గ్రామ పంచాయతీలో ఆదివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో బాగంగా పోలోపల్లి గ్రామంలో మండల టీడీపీ అధ్యక్షుడు కె.కె.చౌదరి అధ్యక్షతన ఇంటింటికి తిరిగి పథకాలపై వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం అవలంభిస్తున్న సైకో పాలనకు ప్రతిఒక్కరూ చరమగీతం పాడి పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసే నాయకుడిని ప్రభుత్వాన్ని ఎంచుకోవాలన్నారు. కార్యక్రమంలో రాజశేఖర్‌నాయుడు, నరసింహరాజు, పార్లమెంటు ఉపాధ్యక్షుడు రమేష్‌నవీన్, రైల్వేకోడూరు నియోజకవర్గ మహిళా నాయకురాలు సుప్రజ, ఎస్సీ సెల్ మండల నాయకులు ఈశ్వరయ్య, పెంచలయ్య, పార్లమెంటు అధికార ప్రతినిధి బాలకృష్ణ యాదవ్, మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

పెనగలూరు: మండల పరిధిలోని పొందలూరు వడ్డెర కాలనీలోని 20 కుటుంబాలు వైసీపీ, టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జి కస్తూరి విశ్వనాథనాయుడు 50 మంది యువకులు, మహిళలకు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోనికి ఆహ్వానించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీఎంసీ మాజీ చైర్మన్ విశ్వేశ్వరనాయుడు, రాష్ట్ర కార్యదర్శి కె.కె.చౌదరి, అనంతంపల్లె మాజీ సర్పంచ్‌లు శంకరయ్య, పి.రామ్మోహన్‌నాయుడు, యూనిట్ ఇన్‌చార్జి రమణయ్యనాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు పి.రమేష్, పార్లమెంటు ఎస్సీ సెల్ కార్యదర్శి తేనేపల్లి చిన్న, మండల ప్రధాన కార్యదర్శి కె.కళాచంద్ర, వెంకటసుబ్బయ్య, రామయ్య పాల్గొన్నారు.



ప్రజలకు మేనిఫెస్టో వివరిస్తున్న విశ్వనాథనాయుడు

టీడీపీ బాటపట్టిన వైసీపీ మద్దతు సర్పంచులు



ముక్కా రూపానందరెడ్డి సమక్షంలో నియోజకవర్గంలోని సర్పంచులు

రైల్వేకోడూరు, జనవరి 21: వైసీపీ నుంచి సీనియర్ నాయకులు, ప్రముఖ పారిశ్రామికవేత్త ముక్కా రూపానందరెడ్డి టీడీపీలో చేరిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, పుల్లంపేట, పెనగలూరు మండలాలకు చెందిన వైసీపీ మద్దతు సర్పంచులు భారీగా టీడీపీ బాట పట్టారు. నియోజకవర్గంలో చాలా మంది టీడీపీకి దూరంగా ఉన్న నాయకులను ఒక్కతాటిపైకి తెచ్చారు. వైసీపీలో చాలా మంది పెద్ద నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, కార్యకర్తలు టీడీపీ బాట పట్టనున్నారు. ఇదిలా ఉండగా నియోజకవర్గంలోని చిట్వేలి మండలం కేఎస్ అగ్రహారం నుంచి వైస్ ఎంపీపీ సుబ్రహ్మణ్యంరెడ్డి, పోలేపల్లి ఎంపీటీసీ సభ్యుడు పామూరి క్రిష్ణయ్య, రాజుకుంట ఎంపీటీసీ సభ్యులు నానబాల నాగార్జున, తిమ్మాయిపాలెం నుంచి ఆదినారాయణ, ఓబులవారిపల్లె మండలం చిన్నఓరంపాడు పంచాయితీ సర్పంచ్ గద్దె సిద్దమ్మ, ముక్కావారిపల్లె సర్పంచ్ అరవ శ్రీధర్, ఉప సర్పంచ్ యర్రబారపు రవిశంకర్‌రెడ్డి, పుల్లంపేట మండలం అనంతంపల్లె సర్పంచ్ కొనిరెడ్డి జయరాంరెడ్డి, గారాలమడుగు సర్పంచ్ షేక్ మహమ్మద్‌అలీ, పుత్తనవారిపల్లె సర్పంచ్ సుభాషిణి, చిన్నంపల్లెకి చెందిన గజపతి, ఓబులవారిపల్లె మాజీ సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి, వై.కోట మాజీ సర్పంచ్ బాలాజీలు చేరిన వారిలో ఉన్నారు.

విగ్రహ ప్రతిష్ఠలో ద్వారకనాథరెడ్డి



విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ద్వారకనాథరెడ్డి

రామాపురం, జనవరి 21: మండలంలోని హసనాపురం పంచాయతీ వసంతవాండ్లపల్లెలో నూతనంగా నిర్మించిన శ్రీహనుమాన్ సమేత సీతారామ లక్ష్మణ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి ఆదివారం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ సీనియర్ నాయకుడు గడికోట ద్వారకనాథరెడ్డి పాల్గొన్నారు. అనంతర ఆయన గ్రామోత్సవం, సుదర్శన హోమం, విష్ణుహోమం, మంగళహారతి కార్యక్రమాల్లో పాల్గొని ఆయనకు ఆలయ అర్చకులు, ధర్మకర్తలు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేశారు. శ్రీరాముని కరుణాకటాక్షాలతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో సుభిక్షంగా జీవించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నాగసుబ్బారెడ్డి, పెంచల్‌రెడ్డి, రేఖం శివయ్య తదితరులు పాల్గొన్నారు.

హరిహరాలయంలో భజన కీర్తనలు

రామాపురం, జనవరి 21: అయోధ్య రామయ్య విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా మండల కేంద్రమైన రామాపురం హరిహరాలయంలో సోమవారం ఉదయం 9.30 గంటలకు భజన కార్యక్రమాలు, 10.30 గంటలకు ర్యాలీ, ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా వినిపించడం జరుగుతుందని జిల్లా బహిరంగదళ్ సహసం యోజక్ వీరారెడ్డి, లక్కిరెడ్డిపల్లె ప్రఖండ గౌరవాధ్యక్షుడు ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు దామోదర్‌నాయుడు, మండల అధ్యక్షుడు ఆంజనేయులు, మండల సహాయ కార్యదర్శి బలరాం ఆధ్వర్యంలో రామయ్య విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందన్నారు. ఉదయం 10.30 నుంచి ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా అయోధ్యలో జరిగే ప్రతిష్ఠ కార్యక్రమం లైవ్‌లో వీక్షించవచ్చని, తరువాత అన్నప్రసాద వితరణ తర్వాత భజనలు సాయంత్రం 4 గంటల వరకు జరుగుతాయన్నారు.


పేదలకు కంటి ఆపరేషన్లు



బాధితులను పరీక్షిస్తున్న కంటి వైద్యులు

రాయచోటిటౌన్, జనవరి 21: జిల్లా కేంద్రమైన చెన్నముక్కపల్లె గ్రామంలో గల లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం జరిగిన కంటి వైద్య శిబిరంలో 9 మంది పేదలకు కంటి ఆపరేషన్లు నిర్వహించారు. ఈ సందర్భంగా రాయచోటి నియోజకవర్గంతో పాటు జిల్లా పరిధిలోని రాజంపేట, రైల్వేకోడూరు, యర్రావారిపాలెం, కేవీపల్లె, కలకడ, కలికిరి, పెద్దమండెం, గుర్రంకొండ, కదిరి, ఎన్‌పీకుంట, వేంపల్లె, చక్రాయపేట తదితర ప్రాంతాల నుండి వచ్చిన 30 మందికి కంటి పరీక్షలు నిర్వహించిన వైద్యులు అందులో అర్హులైన 9 మందికి కంటి ఆపరేషన్లు నిర్వహించారు. అలాగే గతంలో ఆపరేషన్ చేయించుకున్న 40 మందికి ఉచితంగా కంటి అద్దాలు, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ కంటి ఆసుపత్రి చైర్మన్ వైవీ స్వరూపగుప్త, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లయన్ చెన్నూరు అన్వర్‌బాషా, ఏపీఐఐసీ డైరెక్టర్ రాయవరం శ్రీనివాసులరెడ్డి, లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ శివరామిరెడ్డి, కంటి వైద్యులు మహాలక్ష్మి, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ రాజగోపాల్‌రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చిన్నఓరంపాడులో భవిష్యత్తుకు గ్యారెంటీ



గ్యారెంటీ బాండును అందజేస్తున్న దృశ్యం

ఓబులవారిపల్లె, జనవరి 21: మండలంలోని చిన్నఓరంపాడు గ్రామ పంచాయతీ అయ్యలరాజుపల్లె హరిజనవాడ, వడ్డిపల్లె గ్రామంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ అవలంభించబోయే మేనిఫెస్టోలోని కార్యక్రమాలను తెలుపుతూ వారి కుటుంబానికి అందే ఫలాలను వివరించారు. మండల టీడీపీ సీనియర్ నాయకుడు నాగేంద్రనాయుడు, మాజీ ఎంపీటీసీ వేమన రవీంద్రనాయుడు, యువనాయకుడు పయ్యావుల కోటేశ్వరరావుల ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వస్తుందని, ప్రతి కార్యకర్త ధైర్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అనితదీప్తి, జయచంద్ర, రామయ్య, చిన్నఓరంపాడు యువకులు రామ్మోహన్, రాజా పాల్గొన్నారు.

క్షయవ్యాధి గ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ

సుండుపల్లె, జనవరి 21: మానవతా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక పీహెచ్‌సీలోని క్షయవ్యాధిగ్రస్తులకు ఆదివారం పౌష్టికాహారం పంపిణీ చేసినట్లు వైద్యాధికారిణి ఫర్హానా తెలిపారు. వైద్యశాలలో 12 మంది క్షయవ్యాధిగ్రస్తులకు అందించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా వైద్యశాఖ ఫార్మసిస్ట్, మానవతా సంస్థ ఆరోగ్య కార్యదర్శి శివకుమార్‌ను అభినందించారు. అలాగే దుప్పట్లను పంపిణీ చేశారు. మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో మానవతా మండల చైర్మన్ గంగిరెడ్డి, రిటైర్డ్ టీచర్ చంగల్‌రాయుడు, మానవతా సభ్యులు హరికిరణ్, నాగరాజు, సూరి తదితరులు పాల్గొన్నారు.

25, 26న షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంటు

నందలూరు, జనవరి 21: స్వర్ణాంధ్ర మదర్ ల్యాండ్ విక్టరీ స్కౌట్ గ్రూపు ఆధ్వర్యంలో డబుల్స్ నాన్ మెడలిస్ట్ షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంటు పోటీలు ఈ నెల 25, 26 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు శ్యామ్‌రాజు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిపబ్లిక్‌డే సందర్భంగా ఉమ్మడి జిల్లా స్థాయిలో ఈ పోటీలు నిర్వహిస్తున్నామని, గెలుపొందిన వారికి వరుసగా రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2వేలు, రూ.వెయ్యి అందజేయనున్నట్లు తెలిపారు. ఈ టోర్నమెంటులో పాల్గొనే వారు ఈ నెల 23లోపు రూ.500 చెల్లించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

పుంగనూరులో ప్రజాస్వామ్యం ఖూనీ

- మంత్రి పెద్దిరెడ్డికి ఎస్పీ వత్తాసు
- మా కార్యకర్తలను పోలీసులు చెప్పులతో కొట్టారు
- గవర్నర్‌కు బీసీవై పార్టీ అధినేత ఫిర్యాదు



గవర్నర్‌కు పోలీసులపై ఫిర్యాదు చేస్తున్న రామచంద్రయాదవ్

పుంగనూరు, జనవరి 21: పుంగనూరు నియోజకవర్గంలో మంత్రి పెద్దిరెడ్డి వల్ల పోలీసులు, కొందరు అధికారులు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్నారని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్ ఫిర్యాదు చేశారు. విజయవాడలోని రాజ్‌భవన్‌లో ఆదివారం గవర్నర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. బీసీవై పార్టీ కార్యకర్తలపై పోలీసుల దాడికి సంబంధించిన ఫొటోలు, సీఐ చెప్పుతో కొట్టిన ఫొటోను గవర్నరుకు అందజేశారు. సంప్రదాయంగా జరుపుకొనే పండుగలకుకూడా అనుమతుల పేరుతో పోలీసులు వేధిస్తున్నారన్నారు. ఎస్పీ రిషాంత్‌రెడ్డి, పలమనేరు డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, పుంగనూరు నియోజకవర్గంలోని సీఐలు, ఎస్ఐలు మంత్రికి లబ్ధి చేకూర్చేలా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నట్లు వివరించారు. తాము నిర్వహించ తలపెట్టిన సభలను పోలీసులు అడ్డుకోవడాన్ని, అక్రమ కేసులు పెట్టారని, శ్రేణులపై చెప్పులతో కొట్టి భయపెట్టారని, దుర్భాలాడారని గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్లు యాదవ్ తెలిపారు. 'వైసీపీ అధికారంలోకి వచ్చాక కొంతమంది పోలీసు అధికారులు ప్రతిపక్షాలను వేధించడమే విధిగా పెట్టుకున్నారు. ముఖ్యంగా చిత్తూరుఎస్పీ రిషాంత్‌రెడ్డి వైసీపీ కార్యకర్తలా, మంత్రికి బంట్రోతులా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం చేసే ప్రతి ఒక్కరిపైనా తప్పుడు కేసులు పెడుతూ భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. మంత్రి అనుచరులు వ్యక్తులపైనే కాకుండా ఆస్తులపైనా దాడులు చేస్తున్నారు' అని రామచంద్రయాదవ్ పేర్కొన్నారు. తాను ఇచ్చిన ఫిర్యాదును స్వీకరించిన గవర్నర్ సానుకూలంగా స్పందించి సాక్ష్యాధారాలను పరిశీలించి విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు.

ఉలవలదిన్నెలో ఉద్రిక్తత

- బీసీవై పార్టీ శ్రేణులపై వైసీపీ కార్యకర్తల దాడి
- 20 మందికి గాయాలు





దాడిలో గాయపడిన వారు



పుంగనూరు, జనవరి 21: పుంగనూరు పట్టణ శివారులోని ఉలవలదిన్నెలో ఆదివారం రాత్రి బీసీవై పార్టీకి మద్దతు ఇస్తున్నారని 20 మందిపై వైసీపీ నాయకులు, కార్యకర్తలు దాడి చేశారు. దీంతో ఉద్రిక్తత నెలకొంది. ఈ ఘటనపై బాధితుడు, బీసీవై పార్టీ వలంటీరు కిరణ్ కుమార్ తెలిపిన ప్రకారం.. ఉలవలదిన్నెలో ఆదివారం క్రికెట్ మ్యాచ్ జరిగి అందరూ ఆట ముగించుకుని ఇళ్లకు చేరుకున్నారు. గ్రామంలో బీసీవైపార్టీకి మద్దతు ఇస్తున్నారని, అందులోని శ్రీనివాసులు క్రికెట్ మైదానంలో ఉన్నారని తెలుసుకుని వైసీపీకి చెందిన సర్పంచ్ సుబ్రహ్మణ్యం, లవకుమార్, సురేశ్ మరో 15మంది కలిసి దాడికి దిగారు. తీవ్రంగా కొడుతున్నారని తెలుసుకుని వారి కుటుంబీకులు, బంధువులు వెళ్లగా వారిని కూడా కర్రలు, రాళ్లతో మోటారు సైకిళ్లపై వచ్చిన వారిని వచ్చినట్లు కొట్టి రక్తగాయాలు చేశారు. ఈ దాడిలో శ్రీనివాసులు, చెంగప్ప, శివరాజు, శివ, సునీల్‌కుమార్, సుజిత్, మహేశ్, కిరణ్‌కుమార్, కొందరు మహిళలతో కలిసి 20 మంది తలలు పగలి, కాళ్లు,చేతులు, శరీరంపై గాయాలతో చికిత్స కోసం పుంగనూరు ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లారు. ఈ దాడితో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. పోలీసులకు తాము ఫిర్యాదు చేసినా తగిన న్యాయం చేయలేదని, వైసీపీ వారివైపే మాట్లాడుతున్నారని, ఆస్పత్రిలోనూ సరైన వైద్యం చేయలేదని బాధితులు వాపోయారు. ఈవిషయంపై బీసీవై పార్టీ నాయకులు మాట్లాడుతూ పుంగనూరులో వైసీపీ అరాచకాలపై తమ నాయకుడు రామచంద్రయాదవ్ రాష్ట్ర గవర్నర్‌కు ఫిర్యాదు చేసిన రోజే వైపీపీ దౌర్జన్యాలు, దాడులకు దిగిందని ఆరోపించారు.

తిరుమలలో నేడు రామాయణ పారాయణం

తిరుమల, జనవరి21(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని ధర్మగిరి వేదపాఠశాలలో సోమవారం సంపూర్ణ రామాయణ పారాయణం కార్యక్రమాన్ని టీటీడీ నిర్వహించనుంది. అయోధ్యలో సోమవారం రామాలయంలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు రామాయణ పారాయణం నిర్వహించనున్నారు. అయోధ్యలో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరిగే ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఎస్వీబీసీ తమిళం, కన్నడ, హిందీ ఛానళ్లతో పాటు యూట్యూబ్ తెలుగు ఛానల్‌లో ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు. ఎస్వీబీసీ తెలుగు ఛానల్‌లో తిరుమలలోని కళ్యాణోత్సవం అనంతరం 12 గంటల నుంచి అయోధ్య కార్యక్రమాలు ప్రత్యక్షప్రసారం కానున్నాయి.

బ్రాహ్మణులకు ప్రాధాన్యం కల్పించే పార్టీకే మద్దతు

రాష్ట్ర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు వెంకటరామరాజు

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 21: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తమకు రాజకీయ ప్రాధాన్యం కల్పించిన పార్టీకే మద్దతు ఇస్తామని బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరామరాజు స్పష్టంచేశారు.తిరుపతిప్రెస్‌క్లబ్‌లోఆదివారం ఆయన మాట్లాడుతూ.. 2017లో ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్యలో అన్ని రాజకీయపక్షాలకు చెందినవారు ఉన్నారని, అయినా బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 14 లక్షలకు పైగా ఉన్న బ్రాహ్మణులకు జనాభా దామాషా ప్రకారం 10 నుంచి 15 అసెంబ్లీ స్థానాలు కేటాయించాలన్నారు. బ్రాహ్మణకార్పొరేషన్ ఏర్పాటుచేసి, వెయ్యి కోట్లు ఇస్తామన్న వైసీపీ ప్రభుత్వం మాట నిలబెట్టుకోలేదన్నారు. అన్యాక్రాంతమైన బ్రాహ్మణ సమాజానికి సంబంధించిన స్థలాలను తిరిగి ఇవ్వాలని, బ్రాహ్మణ వృత్తి చేసుకుంటున్న వారికి రూ.25 వేలు ఇవ్వాలని, ఆలయ కైంకర్యాల విషయాల్లో అధికారులు, రాజకీయ జోక్యం ఉండకూడదని అన్నారు. టీటీడీలో పనిచేస్తున్న పోటు కార్మికులు, పరిచారికులు, వేదపండితులను పర్మినెంట్ చేయాలన్నారు.





తిరుమల నాకు ఇష్టమైన ప్రదేశం

తిరుమల తనకు ఎంతో ఇష్టమైన ప్రదేశమని సినీ హీరోయిన్ శ్రియ చెప్పారు. శ్రీవారిని ఆదివారం ఉదయం దర్శించుకున్న ఆమె ఆలయం బయట మీడియాతో మాట్లాడారు.అలాగే మిస్ ఎర్త్ ఇండియా-2019 తేజస్విని మనోజ్ఞ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి





కుప్పంలో భారీ ర్యాలీ - బీసీ సదస్సులో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తదితరులు

అరాచక పాలనను అంతమొందించాలి

కుప్పం టీడీపీ బీసీ సదస్సు పిలుపు

కుప్పం, జనవరి 21: రాష్ట్రంలో జగన్ సాగిస్తున్న అరాచక పాలనకు బీసీలే అంతం పలకాలని కుప్పం టీడీపీ బీసీ సదస్సు పిలుపునిచ్చింది. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటినుంచి దాడులు, దౌర్జన్యాలే తప్ప బీసీలకు ఒరిగిందేమీ లేదని సదస్సు స్పష్టం చేసింది. కుప్పంలో ఆదివారం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మున్సిపల్ టీడీపీ అధ్యక్షుడు రాజ్‌కుమార్ అధ్యక్షతన జయహో బీసీ సదస్సు నిర్వహించారు. స్థానిక టీడీపీ కార్యాలయంనుంచి భారీ ర్యాలీ కుప్పం ఆర్టీసీ బస్టాండు సర్కిల్‌కు బయలుదేరింది. ఈ సర్కిల్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సభలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల వైసీపీ పాలనలో బీసీలు తీవ్ర అణచివేతకు గురయ్యారని అన్నారు. రాష్ట్రంలో 56 కార్పొరేషన్లు ఏర్పాటుచేసి ఏ ఒక్క కార్పొరేషన్‌కూ నిధులు కేటాయించని ఘనత జగన్‌కే దక్కిందన్నారు. రాష్ట్రంలో బీసీలందరూ టీడీపీవైపే ఉన్నారని చెప్పారు.

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్.మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, టీడీపీ కుప్పం నియోజకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు తదితరులు మాట్లాడుతూ బీసీల సంక్షేమంకోసం చంద్రబాబు గతంలో ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీలను జగన్ పట్టించుకోవడం మానేశారని విమర్శించారు. పలువురు బీసీ నాయకులు మాట్లాడుతూ కేవలం మాటలు తప్ప జగన్ తమకు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. టీడీపీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ మాట్లాడుతూ బీసీల కష్టాలు తీరేకాలం ఎంతో దూరంలో లేదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోపీనాథ్, చంద్రశేఖర్, ప్రతాప్, మురళి, శాంతారాం, కాణిపాకం వెంకటేశ్, జనసేన నియోజకవర్గ అధ్యక్షుడు నరేశ్, ఇతర టీడీపీ బీసీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిత్తూరులో 'రా.. కదలిరా..'

ప్రచారంలో పాల్గొన్న టీడీపీ, జనసేన నేతలు



కరపత్రాలతో ఇంటింటికి వెళుతున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, జనవరి 21: చిత్తూరులో టీడీపీ, జనసేన నేతలు సంయుక్తంగా 'రా.. కదలిరా..' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆదివారం ఉదయం దొడ్డిపల్లెలోని సప్తకన్నికలమ్మ ఆలయంలో పార్టీ నేతలు, కార్యకర్తలు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలిరోజు నగరంలోని 1, 2, 50 డివిజన్లలో టీడీపీ ఎన్నికల మినీ మ్యానిఫెస్టోతో ముద్రించిన కరపత్రాలను పంచి పెట్టి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్సీ, నియోజకవర్గ సమన్వయకర్త దొరబాబు మాట్లాడుతూ.. వైసీపీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు, టీడీపీ అధికారంలోకి రాగానే ఎలాంటి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందో ప్రజలకు తెలియజేసేందుకే ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. ఎక్కడా లేనివిధంగా చిత్తూరు నియోజకవర్గంలో ఆరుగురు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థుల ఆశావహులు, పార్టీ నేతలు, కార్యకర్తలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. ఎమ్మెల్యే టికెట్ ఎవరికిచ్చినా అందరూ కలసి పనిచేస్తారని స్పష్టం చేశారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీల అధికారమే లక్ష్యంగా ఇరు పార్టీల శ్రేణులు కృషిచేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు చంద్రప్రకాష్, గురజాల జగన్‌మోహన్, కటారి హేమలత, కాజూరు బాలాజీ, సీఆర్ రాజన్, డీకే శ్రీనివాస్, కోదండయాదవ్, పార్టీ కార్యదర్శి సురేంద్రకుమార్, గురజాల చెన్నకేశవులు నాయుడు, సుబ్రమణ్యం నాయుడు, మోహన్‌రాజ్, సీఎం విజయ, వెంకటేష్ యాదవ్, హేమాద్రి నాయుడు, కాజూరు రాజేష్, త్యాగరాజన్, సయ్యద్ ఫిరోజ్, నౌషాద్, జాఫర్, ఈశ్వర్, శంకర్, రాజశేఖర్, అశోకన్, దుర్గాచౌదరి, శశికర్ బాబు, వరలక్ష్మి, నిత్య, గోపి, శంకర్, ఉదయ్, నిత్యానందం, గోపి, ప్రభు, శ్రీదుర్గ, ప్రియాంక, జనసేన నేతలు దయారాం, ఆరణి కవిత, యశ్వంత్, ఏకే శరవణ, రూపేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో బోయకొండ కిటకిట




ప్రత్యేకాలంకారంలో బోయకొండ గంగమ్మ- క్యూలైన్ల లో వేచియున్న భక్తులు

చౌడేపల్లె, డిసెంబరు 4: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయం భక్తులతో ఆదివారం కిటకిటలాడింది. ఉదయాన్నే అర్చకులు అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి, స్వర్ణాభరణాలతో, పూలతో అలంకరించి, దూప దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. అధికసంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. ధర్మప్రచార పరిషత్ వారోత్సవాలలో భాగంగా రెడ్డెప్ప భజన బృందం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఏర్పాట్లను ఆలయ చైర్మన్ నాగరాజరెడ్డి, ఈవో చంద్రమౌళి పర్యవేక్షించారు.

జిల్లా పోలీసు క్రీడలు ప్రారంభం

చిత్తూరు, జనవరి 21: చిత్తూరులోని జిల్లా పోలీసు మైదానంలో ఆదివారం పోలీసు స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ప్రారంభమయ్యాయి. శాంతి కపోతాలను, బెలూన్లను ఎస్పీ రిషాంత్‌రెడ్డి ఎగురవేసి లాంఛనంగా ప్రారంభించారు. విధి నిర్వహణలో సతమతమయ్యే పోలీసు సిబ్బందికి క్రీడలు ఉపశమనం కలిగిస్తాయన్నారు. క్రీడలలో పాల్గొనే ప్రతి ఒక్కరూ స్పోర్ట్స్‌ను టీమ్ వర్క్‌గా, పాజిటివ్‌గా తీసుకోవాలన్నారు.




క్రీడల్లో పాల్గొన్న పోలీసులు



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ

క్రీడల్లో నైపుణ్యం ఉంటే మానసిక ఒత్తిడి నుంచి తట్టుకుంటారన్నారు. అథ్లెటిక్స్, టెన్నిస్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, టగ్ ఆఫ్ వార్‌తో పాటు పలు అంశాల్లో క్రీడలు జరుగుతాయన్నారు. ఆదివారం వంద మీటర్లు, 400 మీటర్ల పరుగు పందెం, హ్యాండ్‌బాల్, వాలీబాల్, లాంగ్‌జంప్,షార్ట్‌పుట్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయి. కార్యక్రమంలో ఏఎస్పీలు సుధాకర్, శ్రీలక్ష్మి, నాగేశ్వరరావు, ఎస్‌బీ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో టెన్షన్...టెన్షన్

టీడీపీ ప్రచార రథాన్ని అడ్డుకున్న వైసీపీ నేతలు - పోలీసులకు ఇరువర్గాల ఫిర్యాదులు...కేసుల నమోదు

శ్రీకాళహస్తి, జనవరి 21: టీడీపీ ప్రచార రథాన్ని వైసీపీ నేతలు అడ్డుకున్న ఘటన శ్రీకాళహస్తిలో శనివారం రాత్రి జరిగింది.శ్రీరామ్ నగర్ కాలనీలో టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితా రెడ్డి ఇంటింటికి మీ బొజ్జల కార్యక్రమం నిర్వహించారు.టీడీపీ ప్రచార రథం నుంచి సైకో పోవాలి సైకిల్ రావాలి అన్న పాటలు విన్పిస్తుండగా వైసీపీ ఏర్పేడు ఇంచార్జి కిషోర్ రెడ్డి, శ్రీకాళహస్తీశ్వరాలయ బోర్డు ప్రత్యేక ఆహ్వానితుడు మోహన్ రెడ్డి, అమ్మపాలేనికి చెందిన మురళి రెడ్డి మరికొందరితో కలిసి టీడీపీ రథాన్ని అడ్డుకున్నారు. సైకో పాటను నిలిపివేయాలనడంతో ఇరు పార్టీల నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. సమీపంలోనే ఉన్న వైసీపీ కార్యాలయం నుంచి వారి ప్రచార రథాన్ని ఘటనా స్థలానికి చేర్చి టీడీపీ ప్రచార రథానికి ముందుగా సాగారు. మళ్లీ ఇరు వర్గాల మధ్య మాట మాటా పెరిగింది.టీడీపీ నాయకుడు కన్నలి ప్రతాప్ రెడ్డి సర్దిచెప్పారు.తర్వాత టీడీపీ ప్రచార రథాన్ని అడ్డుకున్న వారిలో ఒక్కరైన మురళి రెడ్డి ఊరందూరుకు చేరుకొని బొజ్జల సుధీర్ రెడ్డి కుటుంబ సభ్యులకు క్షమాపణ చెప్పినట్లు సమాచారం.కాగా ప్రచార రథాన్ని అడ్డుకున్న ఘటన ఆదివారం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. దీంతో వైసీపీలో అంతర్మథనం జరిగినట్లు సమాచారం.ఆదివారం మధ్యాహ్నం మురళి రెడ్డి తమపై దాడి జరిగిందంటూ శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యారు. టీడీపీ నాయకులు తనను కిడ్నాప్ చేసి శనివారం అర్ధరాత్రి ఊరందూరుకు తీసుకువెళ్లి గన్ తలపై పెట్టి చంపేస్తామని బెదిరించినట్లు ఆరోపిస్తూ శ్రీకాళహస్తి 1వ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.చివరకు టీడీపీ ప్రచార రథాన్ని అడ్డుకున్న ఘటనలో ఇరువర్గాల ఫిర్యాదులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. వైసీపీ నాయకుడు మురళి ఫిర్యాదు మేరకు కిడ్నాప్,దాడి కేసు నమోదు చేశారు. అలాగే టీడీపీ ప్రచార రథం డ్రైవర్ మోహన్ తనపై వైసీపీ నాయకులు కిషోర్ రెడ్డి, మోహన్ రెడ్డి, మురళి అడ్డుకొని దాడి చేయడంతో పాటు తనని కులం పేరుతో దూషించారని ఫిర్యాదు చేశారు. దీనిపై ఆ ముగ్గురి మీదా అట్రాసిటీ, దాడి కేసులు నమోదు చేశారు.



వైసీపీ నేతలపై సీఐ అంజూయాదవ్‌కు టీడీపీ నాయకుల ఫిర్యాదు

మహిళల స్వేచ్ఛకు భరోసా ఏదీ: టీడీపీ

శ్రీకాళహస్తిలో మహిళల స్వేచ్ఛకు భరోసా లేదని సుధీర్ రెడ్డి సతీమణి రిషితారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ ప్రచార రథాన్ని అడ్డుకోవడంపై ఆమె తన ఆవేదనను వీడియోలో పొందుపరిచి సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారంలోకి తెచ్చారు.శ్రీరామ్ నగర్ కాలనీలో ప్రజాస్వామ్యబద్ధంగా ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేసుకుంటుంటే వైసీపీ కార్యాలయ సమీపంలో మద్యం సేవించిన ఆ పార్టీ నేతలు కిషోర్ రెడ్డి, మోహన్ రెడ్డి, మురళి రెడ్డి దుర్భాషలాడుతూ అడ్డుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై బొజ్జల సుధీర్‌రెడ్డి ఏర్పేడు మండలం ఎండీపుత్తూరులో జరిగిన మీడియా సమావేశంలో స్పందించారు.తానెప్పుడూ ఎమ్మెల్యే కుటుంబ సభ్యుల జోలికి కానీ ఆయన సోదరుడు కిషోర్‌రెడ్డి జోలికి కానీ పోలేదన్నారు. అయితే వైసీపీ నేతలు తన కుటుంబంపై దాడి చేయడానికి ప్రయత్నం చేయడం బాధాకరమన్నారు. తన కుటుంబం జోలికి వస్తే తాట తీస్తానని హెచ్చరించారు.

వైసీపీని సాగనంపితేనే అభివృద్ధి: అమర్



పలమనేరు, జనవరి 21: రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపితేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని మాజీ మంత్రి అమరనాథరెడ్డి పేర్కొన్నారు. పలమనేరులో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ఆదాయం పెరగలేదని, ఉద్యోగాలు రాలేదన్నారు. మద్యం నిషేధం చేశాకే ఓటు అడుగుతానన్న జగన్ ఆ మాటపై కట్టుబడాలన్నారు. వైసీపీ పాలనలో నష్టపోయింది బడుగు, బలహీన వర్గాలేనని పేర్కొన్నారు. అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి ప్రజలకు సామాజిక న్యాయం చేశానని చెబుతున్న జగన్.. జీవో నెంబరు 3ను ఎందుకు రద్దుచేశారో చెప్పాలన్నారు. భూరక్షణ చట్టం అమల్లోకి వస్తే ప్రజల భూములు గోవిందా అని, టీడీపీ వచ్చాక భూరక్షణ చట్టం రద్దుచేస్తామని చెప్పారు. పేదలను సంపన్నులను చేసే బాధ్యత తెలుగుదేశం పార్టీ తీసుకొంటుందని, తాము అధికారంలోకి వచ్చాక అంగన్వాడీల సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు.

చెరువులో యువకుడి గల్లంతు



సంజయ్ (ఫైల్‌ఫొటో)

కుప్పం, జనవరి 21: కుప్పం మండలం పెద్దబంగారునత్తం చెరువులో మునిగి ఒక యువకుడు గల్లంతయ్యాడు. స్థానికుల కథనం మేరకు... కుప్పం పురపాలక సంఘం సామగుట్టపల్లెకు చెందిన సంజయ్ (25) మరో ముగ్గురు స్నేహితులతో కలిసి ఆదివారం పెద్దబంగారునత్తం చెరువులో సరదాగా ఈత కొట్టడానికి వెళ్లారు. ఈత కొడుతుండగా సంజయ్ చెరువులో మునిగి గల్లంతయ్యాడు. మిగిలిన ముగ్గురు స్నేహితులు బయటకు వచ్చి సమాచారమిచ్చారు. దీంతో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది చెరువు వద్దకు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. అయితే, యువకుడి మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో అతడితో కలిసి ఈతకు వెళ్లిన యువకులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.

పుదుచ్చేరి బీచ్‌లో పెనుమూరు యువకుడి మృతి



జీవన్ చౌదరి (ఫైల్ ఫొటో)

పెనుమూరు, జనవరి 21: కుటుంబ సభ్యులతో విహారయాత్రకు వెళ్లిన పెనుమూరు యువకుడు పుదుచ్చేరి బీచ్‌లో గల్లంతై.. శవమై తేలాడు. పెనుమూరు మండలం మనియానంపల్లి గ్రామానికి చెందిన సుధాకర్‌నాయుడు, భవానీ పెద్ద కుమారుడు జీవన్ చౌదరి(31), కుటుంబ సభ్యులతో కలిసి విహారయాత్రకు పుదుచ్చేరి వెళ్లారు. అక్కడ మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో బీచ్‌లో సరదాగా ఆడుకుంటుండగా భారీ అలలు రావడంతో గల్లంతయ్యాడు. కుటుంబ సభ్యులు వెంటనే అక్కడ ఉన్న స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. గంట తర్వాత జీవన్ మృతదేహం ఒడ్డుకు కొట్టుకొచ్చింది. అక్కడి పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన డీఏ శ్రీనివాస్



పుంగనూరు, జనవరి 21: పుంగనూరు బైపాస్‌రోడ్డులో ఆదివారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని మాజీ ఎంపీ డీకే ఆదికేశవులు కుమారుడు డీఏ శ్రీనివాస్ కలిశారు. మదనపల్లె-చిత్తూరు బైపాస్‌రోడ్డులోని మాజీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి రియల్ ఎస్టేట్ వెంచర్ వద్ద ఇద్దరూ కొంతసేపు ఏకాంతంగా మాట్లాడుకున్నారు.

పాతకక్షలతో వ్యక్తిపై దాడి

మదనపల్లె టౌన్, జనవరి 21: పాతకక్షలతో ఓ వ్యక్తిపై ఇద్దరు దాడి చేశారు. బాధితుని కథనం మేరకు.. మండలంలోని సీటీఎం-1 పంచాయతీ పడమట వీధికి చెందిన రఘునాథరెడ్డి కుమారుడు సుదర్శన్‌రెడ్డి(35) శనివారం రాత్రి వీధిలో నడుచుకుని వెళుతుండగా వెనక నుంచి ఇద్దరు వ్యక్తులు కర్రలతో దాడి చేసి పారిపోయారు. గాయపడిన సుదర్శన్‌రెడ్డి ఆదివారం ఉదయం స్థానిక ప్రభుత్వాస్పత్రికి చేరుకుని చికిత్స చేయించుకున్నాడు. తమ గ్రామంలో వినాయచవితి పండగ సందర్భంగా జరిగిన వాగ్వాదంతో తనపై కక్ష పెంచుకుని హుస్సేన్, కాలేషా అనే ఇద్దరు దాడి చేశారని సుదర్శన్‌రెడ్డి తెలిపాడు. ఈ విషయమై తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేస్తానని చెప్పాడు.

ఐదుగురు కోడిపందెం రాయుళ్లు అరెస్టు

రామసముద్రం, జనవరి 21: రామసముద్రం మండలం చెంబకూరు సమీపంలోని టేకులపల్లి వద్ద కోడి పందేలు ఆడుతున్న ఐదు మందిని ఆదివారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు. కోడి పందేలు ఆడుతున్నట్లు సమాచారం అందడంతో తమ సిబ్బందితో కలిసి దాడి చేసి ఐదుగురును అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.5270 నగదు, రెండు పందెం కోళ్లు, ఆరు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈసందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై ఖచ్చితంగా కేసులు నమోదు చేస్తామని చెప్పారు.

సారా కేసులో వ్యక్తి అరెస్టు

గుర్రంకొండ, జనవరి 21:అక్రమంగా సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ తెలిపారు. మండలంలోని చెర్లోపల్లె పంచాయతీ దద్దాలవారిపల్లెకు చెందిన గరుడప్ప సారా విక్రయిస్తున్నట్లు తెలియడంతో పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో గరుడప్ప పట్టుబడగా అతని వద్ద నుంచి పది లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ములకలచెరువు ఎస్‌ఈబీ సీఐ బదిలీ

ములకలచెరువు, జనవరి 21: ములకలచెరువు ఎస్‌ఈబీ సీఐ మల్లిక బదిలీ అయ్యారు. ఆమెను కర్నూల్ జిల్లాకు బదిలీ చేస్తూ ఎస్‌ఈబీ కమిషనర్ రవికుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడికి సీఐ రామ్మోహన్‌ను బదిలీ చేశారని, సోమవారం బాధ్యతలు స్వీకరిస్తామరి ఎస్‌ఈబీ సిబ్బంది తెలిపారు.

సంతానలక్ష్మికి ప్రత్యేక పూజలు

గుర్రంకొండ, జనవరి 21:గుర్రంకొండ మండలం చెర్లోపల్లెలో కొలువైన రెడ్డెమ్మకొండ ఆలయంలో ఆదివారం అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలను చేశారు. ఆలయంలో అమ్మవారు సంతాన లక్ష్మీగా ప్రసిద్ధి చెందారు. ఇందులో భాగంగా అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం అమ్మవారిని పరిమళభరిత పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి మహిళా భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలను సిబ్బంది పంపిణీ చేశారు.

జగమంతా రామమయం

●నేడు అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ



వాల్మీకిపురంలో శ్రీరామ భక్తుల ప్రదర్శన

వాల్మీకిపురం, జనవరి 21: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా వాల్మీకిపురంలో ఆదివారం జైశ్రీరామ్.. జైశ్రీరామ్.. రాజారాం అంటూ రామభక్తులు భారీఎత్తున ప్రదర్శన నిర్వహించారు. సోమవారం అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలలో భాగంగా పట్టణంలో భక్తులు శ్రీరామ వ్రత మాల ధరించి పురవీధులలో ర్యాలీ చేపట్టారు. జై శ్రీరామ్ నినాదాలు చేస్తూ భక్తి పారవశ్యంలో మునిగితేలారు. స్థానిక నల్లవీరగం గాభవాని అమ్మవారి ఆలయం నుంచి బయలు దేరి పురవీధులలో శ్రీరామ నామ స్మరణలు చేశారు.

నేడు జైశ్రీరామ్ ర్యాలీ..

వాల్మీకిపురం పట్టణ పడమర పొలిమేరల్లోని ధర్మపథం ఆలయంలో సోమవారం ఉదయం రాముడి విగ్రహానికి అభిషేకం, విశేష పూజలు నిర్వహించనున్నారు. అనంతరం పట్టణ పురవీధుల గుండా శ్రీరామ భక్తుల ర్యాలీ, ప్రత్యేక పూజలు, భక్తులకు అన్న, ప్రసాదాల వితరణ కార్యక్రమాలు చేపట్టనున్నారు. ప్రతి ఇంటా దీపోత్సవం, భక్తుల పూజలు, తదితర కార్యక్రమాలు అలరించనున్నాయి.

నేడు సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు

మదనపల్లె అర్బన్, జనవరి 21: స్థానిక బరామవీధిలోని షిరిడీసాయిబాబా ఆలయంలో అయోధ్యలో రాములోరి విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని విశేషపూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయకమిటీ ఉపాధ్యక్షుడు నాదేళ్లబాబునాయుడు పేర్కొన్నారు. ఉదయం నుంచి ఆలయంలో సీతారాముల ఉత్సవవిగ్రహాలకు విశేషపూజలు ప్రత్యేకంగా అలంకరణలు చేస్తారని తెలిపారు. పూజలనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అలాగే సొసైటీ కాలనీలోని రామాలయంలో అయోధ్య రాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా వివిధ రకాల పూజల కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయకమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఏపీ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో అయోధ్య రాముల ఆలయం ప్రారంభోత్సవం సందర్భంగా విశేషపూజలు నిర్వహిస్తున్నట్లు తిరుమల గ్రానైట్ అధినేత, ఏపీ రెడ్డి సంఘం గౌరవాధ్యక్షుడు వరదారెడ్డిగారి నారదరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మదనపల్లెలో సీతారాముల విగ్రహాలకు విశేషపూజలు ప్రత్యేక అలంకరణ చేస్తామన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. సీటీఎం రోడ్డులోని మంజునాథస్వామి ఆలయంలో అయోధ్యరామాలయం ప్రారంభోత్సవ ం సందర్భంగా అన్నదానం ఏర్పాటు చేసినట్లు ఆలయకమిటీసభ్యులు పేర్కొన్నారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని వారు కోరారు.

అంగన్వాడీ సమ్మెకు ప్రజల మద్దతు కోరుతాం



మదనపల్లెలో సమ్మె చేస్తున్న అంగన్వాడీలు



వాల్మీకిపురంలో నిరసన తెలుపుతున్న అంగన్వాడీ కార్యకర్తలు

మదనపల్లె టౌన్, జనవరి 21: అంగన్వాడీల సమ్మెకు ప్రజల మద్దతు కోరుతామని సీఐటీయూ నాయకురాళ్లు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు 41వ రోజు నిరవధిక సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇన్ని రోజులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. అందుకే తమ సమస్యలను ప్రజల దృష్టికి, అంగన్వాడీ లబ్ధిదారుల దృష్టికి తీసుకెళ్లేందుకు సంతకాల సేకరణ చేస్తున్నామన్నారు. ప్రజలే ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పేలా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మధురవాణి, సుజన, గీత, రాధిక, మంజుల, అనసూయ, అంగన్వాడీలు పాల్గొన్నారు.

ఎంత కట్టడి చేస్తే అంత చెలరేగుతాం..

వాల్మీకిపురం, జనవరి 21:కనీస వేతనాలు ఇవ్వమని కోరితే.. ఈ ప్రభుత్వం అంగన్వాడీలను కట్టడి చేయాలని చూస్తోందని ఇక ఏమాత్రం తగ్గేదేలేదని అంగన్వాడీ కార్యకర్తలు పేర్కొన్నారు. ఆదివారం వాల్మీకిపురంలో అంగన్వాడీ కార్యకర్తలు స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట దీక్షా శిబిరంలో నిరసనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తమ సమస్యలు పట్టించుకోదు మేమేమైనా చేస్తే మాపై చర్యలా అంటూ ధ్వజమెత్తారు. గత 41 రోజులు గడచినా కాలయాపన చేస్తూ ప్రభుత్వం అంగన్వాడీల జీవితాలతో ఆట్లాడుకుంటోందని విమర్శించారు. కార్యక్రమంలో సీఐటీయూ అనుబంధ అంగన్వాడీ యూనియన్ లీడర్లు చంద్రావతి, భూకైలేశ్వరి, అమ్మాజీ, ప్రసన్న, దేవసేన, లక్ష్మీనరసమ్మ, రెడ్డిరాణి, వాల్మీకిపురం, గుర్రంకొండ, కలికిరి మండలాల అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



అంగన్వాడీ యూనియన్ లీడర్లను అరెస్టు చేసిన పోలీసులు

అంగన్వాడీ లీడర్లు అరెస్టు..

వాల్మీకిపురం, జనవరి 21:చలో విజయవాడ దీక్షను భగ్నం చేసే దిశగా ఆదివారం వాల్మీకిపురంలో అంగన్వాడీ యూనియన్ లీడర్లను పోలీసులు అరెస్టు చేశారు. విజయవాడకు వెళ్లరాదని అంగన్వాడీ యూనియన్ లీడర్లు చంద్రావతి, భూకైలేశ్వరి, తదితర హెల్పర్లు, మినీ వర్కర్లను పోలీసులు మధ్యాహ్నం 2గంటలకు అరెస్టు చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించి తిరిగి సాయంత్రం 5.30గంటలకు విడిచిపెట్టారు. పైగా యూనియన్ లీడర్ల వివరాలు పోలీసులు నమోదు చేసుకున్నారు.

చౌడసముద్రంలో పూర్వవిద్యార్థుల సందడి



పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ములకలచెరువు, జనవరి 21: మండలంలోని చౌడసముద్రం జడ్పీ హైస్కూల్‌లో ఆదివారం పూర్వవిద్యార్థుల సందడి వాతావరణం నెలకొంది. 1976-77 సంవత్సరంలో చదుకున్న పూర్వ విద్యార్థులు మళ్లీ 48 ఏళ్ల తరువాత కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ స్థిరపడ్డ రంగాల గురించి చెప్పుకున్నారు. అలాగే చదువుకున్న సమయంలో చేసిన అల్లరిని గుర్తుకు తెచ్చుకుని ఆనందంగా గడి పారు. అనంతరం చదువులు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో పూర్వ విద్యార్థులు గుర్రప్పనాయుడు, కృష్ణప్ప, మల్లప్ప, వెంకటరెడ్డి, నాగరాజు, వేణుగోపాల్. అబ్దుల్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆపూర్వ కలయిక



కందుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

పెద్దతిప్పసముద్రం జనవరి 21 : మండలంలోని కందుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995 -96 వ సంవత్సరం 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు అపూర్వంగా కలిశారు. అప్పట్లో తమకు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులతో పాటు తోటి విద్యార్థులందరు ఒక్క చోటకు చేరి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థి దశలోని జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనం తరం అప్పట్లో తమకు చదువులు చెప్పిన ఉపాధ్యాయులైన శివశంకర్, బాలసంజీవ్, గురుమూర్తిలను ఘనంగా సత్కరించారు. అనంతరం విద్యార్థులందరు కలసి సహపంక్తి బోజనం చేశారు. తాము చదివిన పాఠశాలలో విద్యార్థులందరు ఒకే చోటకు చేరడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సులేమాన్, రెడ్డిబాష, అమరనాథ్, లాయర్ రవీంద్ర, లలితా, శ్రీవల్లి, తదితరులు పాల్గొన్నారు.

సోషలిజాన్ని పరిచయం చేసిన నేత లెనిన్



లెనిన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పిస్తున్న సీపీఐ నాయకులు

మదనపల్లె అర్బన్, జనవరి 21: ప్రపంచానికి సోషలిస్టు సమాజాన్ని పరిచయం చేసన మహోనీయుడు వివిలెనిన్ అని సీపీఐ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో ప్రపంచవిప్లవకారుడు కామ్రేడ్ లెనిన్ శత జయంతిని మదనపల్లె నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. లెనిన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్‌నరసింహులు మాట్లాడుతూ ప్రపంచ పెట్టుబడిదారి వ్యవస్థ మానవ మనుగడకే ప్రమాదమన్నారు. ఈ సమాజం మారితేనే శ్రామిక ప్రజలకు దోపిడీ నుంచి విముక్తి లభిస్తుందన్నారు. రష్యా పెడరేషన్‌లో మార్క్సిస్టు విప్లవపోరాటంతో శ్రామిక పోరాటాన్ని నడిపి సోషలిస్టు సమాజాన్ని స్థాపించారన్నారు. కార్యక్రమంలో మహిళాసంఘం జిల్లా కార్యదర్శి సుమిత్రమ్మ, ఏఎస్ఎం రాష్ట్రనాయకులురాలు లీలావతి, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మురళి, తిరుమల, దేవ, సూరి, రెడ్డి, శోభ, ఏఐఎస్ఎఫ్ నాయకులు శీన, నవీన్, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

కులగణన సర్వే పకడ్బందీగా చేపట్టాలి



కులగణన సర్వేను తనిఖీ చేస్తున్న ఎంపీడీవో సురేంద్రనాథ్

తంబళ్లపల్లె, జనవరి 21: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వేను ఎలాంటి పొరపాట్లు లేకుండా పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీవో సురేంద్రనాథ్ సూచించారు. ఆదివారం మండలంలోని దండువారిపల్లెలో చేపడుతున్న కులగణన సర్వేను ఎంపీడీవో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈ నెల 28వ తేదీ వరకు మొత్తం పది రోజుల పాటు సర్వే జరుగుతుందన్నారు. ఎటువంటి లోపాలు లేకుండా మండలంలోని ప్రతి గ్రామంలో ప్రతి గడపలో క్షేత్రస్థాయిలో సర్వే చేసి కులగణన పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట సచివాలయ సిబ్బంది ఉన్నారు.

బహుజన రాజ్యాధికార సదస్సును విజయవంతం చేయాలి

మదనపల్లె అర్బన్, జనవరి 21: మదనపల్లెలో బహుజన రాజ్యాధికార సదస్సును విజయవంతం చేయాలని బహుజన సమాజ్‌పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండెలగౌతమ్ కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం బహుజన సమాజ్‌పార్టీ అసెంబ్లీలోని ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌతమ్‌కముఆర్ మాట్లాడుతూ బహుజన రాజ్యాధికార సదస్సు ఫిబ్రవరి 3వ తేదీన 10 గంటలకు స్థానిక గాంధీరోడ్డులోని సీఎస్ఐ జేసీఎం కమ్యూనిటీహాల్‌లో జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి బీఎస్పీ రాజ్యసభ సభ్యుడు రాంజీగౌతమ్, ఏపీ రాష్ట్రఅధ్యక్షుడు పరంజ్యోతి, రాష్ట్రనాయకులు హాజరవుతారని చెప్పారు. ఈ సదస్సును రాబోవు సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో బీఎస్పీ మదనపల్లె నాయకులు పాల్గొన్నారు.


బస్సులో పోగొట్టుకున్న పర్స్ అందజేత



ప్రయాణికుడికి పర్స్‌ను అందిస్తున్న ఆర్టీసీ అధికారులు

మదనపల్లె అర్బన్, జనవరి 21: తిరుపతి బస్సులో శనివారం ఓ ప్రయాణికుడు పోగొట్టుకున్న పర్సును ఆర్టీసీ అధికారులు అందజేశారు. ప్రయాణికుడి బస్సులో పర్సును మరచిపోయి వెళ్లడంతో అందులోని ఫోన్‌నెంబరు ఆధారంగా అతనని బస్టాండ్‌కు పిలిపించి ఆర్టీసీ అధికారులు అతనికి పర్సును అందజేశారు. అందులో రెండువేల నూట ఇరువై రూపాయలు నగదు, ఏటీఎంకార్డులు, డ్రైవింగ్‌లైసెన్స్, ఆధార్‌కార్డులు ఉన్నట్లు గుర్తించారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెట్ బీవీనాయక్, విజిలెన్స్ కానిస్టేబుళ్ల రామకృష్ణ, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.


కర్నూలు బయలుదేరివెళ్లిన జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డి



జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డికి వీడ్కోలు పలుకుతున్న దృశ్యం

పెద్దతిప్పసముద్రం జనవరి 21 : లోకాయుక్త జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డి నాలుగు రోజుల పర్యటన అనంతరం ఆదివారం కర్నూలుకు బయలుదేరి వెళ్లారు. తమ స్వగ్రామమైన టి.సదుం పంచాయతీ చెన్నరాయునిపల్లెకు విచ్చేసిన సంగతి విధితమే. చెన్నరాయునిపల్లెలో నాలుగు రోజులు విశ్రాంతి తీసుకున్న ఆయన ఆదివారం మధ్యాహ్నం బయలుదేరి వెళ్లారు. ఆయనకు పీటీఎం ఎస్ఐ రవీంద్రబాబు, రెవెన్యూ అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఆయన రోడ్డు మార్గంలో ములకలచెరువుకు వెళ్లి అక్కడి నుంచి రైలు మార్గంలో కర్నూల్‌కు చేరుకుంటారని కుటుంబీకులు తెలిపారు. ఆయనకు వీడ్కోలు పలికిన వారిలో ములకలచెరువు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనాథ్‌రెడ్డి, మనోజ్‌జయంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా కనుమ పండుగ



పశువుల ఊరేగింపు

కలకడ, జనవరి 21: మండలంలోని ముడియంవారిపల్లిలో గ్రామస్థులు ఆదివారం కనుమ పండుగను కోలాహలంగా జరుపుకున్నారు. రైతులు తమ జీవనాధారమైన పశువులకు పూజలు చేసి ప్రత్యేకంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం పశువులను చిట్లాకుప్ప వద్దకు తోలుకెళ్లి మహిళలు కాట మరాజుకు ప్రసాదాలను సమర్పించారు.

టీడీపీ-జనసేన ప్రభుత్వ ఏర్పాటే లక్ష్యంగా పనిచేయాలి

●జెండాలు పట్టని వారికి వైసీపీలో టికెట్లు

● జనసేన నేత గంగారపు రామ్‌దాస్‌చౌదరి



స్విమ్మర్స్‌తో మాట్లాడుతున్న జనసేన నేత రామ్‌దాస్‌చౌదరి

మదనపల్లె, జనవరి 21: టీడీపీ-జనసేన ఉమ్మడి ప్రభుత్వ ఏర్పాటే లక్ష్యంగా టీడీపీ, జనసేన నాయకులు పనిచేయాలని జనసేన రాయలసీమ కో-కన్వీనర్ గంగారపు రామ్‌దాస్‌చౌదరి పేర్కొన్నారు. ఏనాడూ పార్టీ ముఖం చూడని, పార్టీ జెండా పట్టని వారికి వైసీపీ అధిష్ఠానం టిక్కెట్లు కేటాయిస్తోందని ఆయన విమర్శించారు. మండలంలోని ఎలుకపల్లెకుంట వద్ద చెక్‌డ్యామ్ స్విమ్మర్స్‌తో సమావేశమయ్యారు. అక్కడ వంటా-వార్పు నిర్వహించి వారితో కలసి భోజనం చేశారు. ఈ సందర్భంగా రామ్‌దాస్‌చౌదరి మాట్లాడుతూ రానున్న సాధారణ ఎన్నికల్లో జనసేన-టీడీపీ ఉమ్మడి అభ్యర్థి గెలుపుకోసం ప్రతి ఒక్కరూ ప్రజాస్వామ్య బద్ధంగా ఓటు అనే ఆయుధంతో వైసీపీకి తగిన బుద్ధి చెప్పాలని ఓటర్లను కోరారు. ఈ నాలుగున్నరేళ్లలో రాష్ట్రం అన్ని రంగాల్లో 30 ఏళ్లు వెనక్కి వెళ్లిందన్నారు. యువతకు ఉద్యోగం లేక రైతుకు గిట్టుబాటు ధర లేక మహిళకు రక్షణ లేక సమస్త ప్రజలు విసిగిపోయారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాల శివరాం, పార్టీ మండల అధ్యక్షుడు గ్రానైట్ బాబు, చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడపా సురేంద్ర, జనసైనికులు సలాఉల్లా, గజ్జల రెడ్డెప్ప, గడ్డం లక్ష్మీపతి, లక్ష్మీనారాయణ, గిరి, రాజారెడ్డి, జనార్దన్, నగేష్, గణేష్, సుదర్శన్ పాల్గొన్నారు. కాగా కుల, మతాలకు అతీతంగా అయోధ్యలో సోమవారం జరిగే బాల రాముడివిగ్రహ ప్రతిష్ఠను తిలకించాలని జనసేన రాయలసీమ కో-కన్వీనర్ గంగారపు రామ్‌దాస్‌చౌదరి కోరారు.

ఘనంగా 'పవన్ అన్న వైపు అడుగులేద్దాం' కార్యక్రమం



పీలేరులో ర్యాలీ నిర్వహిస్తున్న జనసైనికులు

పీలేరు, జనవరి 21: జనసేన ఆధ్వర్యంలో ఆదివారం పీలేరులో 'పవన్ అన్న వైపు అడుగులేద్దాం' కార్యక్రమాన్ని ఆ పార్టీ నాయకులు అట్టహాసంగా నిర్వహించారు. జనసేన సిద్ధాంతాలు, పార్టీలో చేరికలను ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పీలేరుతోపాటు మదనపల్లెకు చెందిన పలువురు జనసేన నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు. పీలేరు మండలం మొరవపడ్డిపల్లె గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో జనసేన నాయకులు మై ఫోర్స్ మహేశ్, కామిశెట్టి సుధాకర్, కలప రవి మాట్లాడుతూ ప్రతి జనసైనికుడూ తమ పరిధి లోని ప్రాంతాల్లో జనసేన, టీడీపీ సిద్ధాంతాలను సమగ్రంగా ప్రజలకు వివరించి వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పీలేరు నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి తరలి వచ్చిన పలువురు యువకులకు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అంతకు మునుపు పీలేరు పట్టణంలో భారీ స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీలేరు నియోజకవర్గ జనసేన అధ్యక్షుడు సురేశ్, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు అమర నారాయణ, పీలేరు మండల అధ్యక్ష, కార్యదర్శులు మోహనకృష్ణ, గజేంద్ర, ధనశేఖర్, ఉపాధ్య క్షులు గురు మోహన, విగ్నేశ్, కాపు సంక్షేమ సేన అధ్యక్షుడు మోకాటి సుబ్బయ్య, నాయకులు నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణుల చెంతకు కేంద్ర సంక్షేమ పథకాలు



సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు సుమేర్‌సింగ్

కలకడ, జనవరి 21:కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గ్రామీణుల చెంతకు తీసుకురావడమే వికసిత్ భారత్ సంకల్పయాత్ర అని చేరుతున్నాయని మధ్యప్రదేశ్‌కు చెందిన రాజ్యసభ సభ్యుడు సుమేర్ సింగ్ సోలంకీ అన్నారు. ఆదివారం మండలంలోని ఎనుగొండపాలెం పంచాయతీ దిగువపాలెం జరిగిన వికసిత్ భారత్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేశంలోని పేద వర్గాలు ఎలాంటి కష్టాలు పడుకుండా ప్రధాని నరేంద్రమోదీ అనేక పథకాలను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ప్రజలకు ఉచిత గ్యాస్, పక్కా గృహాలు, పీఎం కిసాన్, ఆయుష్మాన్ భారత్ లాంటి పథకాలతో అర్హులు లబ్ధిపొందడం హర్షణీయమన్నారు. అలాగే క్షేత్ర స్థాయిలో పథకాలు అందుతున్న తీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సాయిలోకేష్, శ్రీకాంత్, ప్రశాంత్, ఎంపీపీ శ్రీదేవి, ఎంపీడీవో పరమేశ్వరరెడ్డి, లతీఫ్ ఖాన్, సర్పంచ్ మంజుల తదితరులు పాల్గొన్నారు.


ఘనంగా అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



అంబేడ్కల్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మదనపల్లె ఎమ్మెల్యే

మదనపల్లె, జనవరి 21: మదనపల్లె రూరల్ మండలం వేంపల్లె ఎస్సీ కాలనీలో ఆదివారం బారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ ఘనంగా నిర్వహించారు. భారతీయ అంబేడ్కర్ సేన(బాస్)తో కలిసి ఎస్సీ కాలనీవాసులు విగ్రహావిష్కరణ మహోత్సవం నిర్వహించారు. మదనపల్లె ఎమ్మెల్యే నవాజ్ బాషా, డీఎస్పీ కేశప్ప, బాస్ వ్యవస్థాపకుడు పీటీఎం శివప్రసాద్, విగ్రహ కమిటీ చైర్మన్ చాట్ల బయన్న, బాస్ కోశాధికారి నీరుగట్టి రమణ, చీకిలబైలు బాబురెడ్డిలు విగ్ర హాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవాజ్‌బాషా మాట్లాడుతూ గొప్ప రాజ్యాంగాన్ని అంబేడ్కర్ అందించారన్నారు. డీఎస్పీ కేశప్ప మాట్లాడుతూ అంబేడ్కర్‌ను ప్రతి ఒక్కరు గౌరవించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అదేమ్మ, ఎంపీటీసీ సుభారా ణి, కౌన్సిలర్ రేణుకమ్మతో పాటు విగ్రహ కమిటీ సభ్యులు వెంకటరమణ, సురేష్, కళ్యాణ్, రెడ్డి, సురేష్, బాబు, జయప్రకాష్, వెంకటటేష్, బాస్ నాయకులు లక్ష్మీనారా య ణ, రెడ్డిప్రసాద్, సూరి, శశికుమార్, పీర్‌బాషా, రత్నం, రాజేష్ పాల్గొన్నారు.

వాల్మీకిలు సమైక్య పోరాటాలకు సిద్ధం కావాలి




సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ వాల్మీకి సంఘం వ్యవస్థాపకుడు పులిశ్రీనివాసులు

మదనపల్లె అర్బన్, జనవరి 21: వాల్మీకులు సమైక్య పోరాటాలకు సిద్ధం కావాలని ఆసంఘం వ్యవస్థాపకుడు పులిశ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఈనెల 28న మదనపల్లెలో వాల్మీకి సంఘం కార్యాలయం ప్రారంభోత్సవానికి వాల్మీకి కు టుంబసభ్యులు తరలిరావాలని ఆయన కోరారు. ఆదివారం స్థానిక వాల్మీకినాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పులిశ్రీనివాసులు మాట్లాడుతూ వాల్మీకుల విద్య, వైద్య, ఉపాధి, సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతికంగా చైతన్యం తీసుకురావాలంటే వాల్మీకుల ఐక్యంగా పోరాటాలు చేయాలన్నారు. ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధుల మెడలువంచి వాల్మీకికు ఎస్టీ పునర్ధరణ చేయడానికి ప్రతి ఒక వాల్మీకి నడుము బిగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వాల్మీకి నాయకులు సద్దల జయసింహా, వలసలమంజునాథ్, నరసింహులు, నిర్మలమ్మ, శ్రీనివాసులు, అర్జున్, రమణ, జయరామ్, నాగరాజ, తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక ఆర్టీసీ బస్సులు

మదనపల్లె అర్బన్, జనవరి 21: మదనపల్లె ఆర్టీసీ టూడిపో నుంచి అరుణాచలానికి ఈ నెల 24న పుష్యపౌర్ణమికి ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడుపుతున్నట్లు టూ డిపోమేనేజరు నిరంజన్ తెలిపారు. బుధవారం ఉదయం 9 గంటలకు మదనపల్లె బస్టాండ్ నుంచి బస్సులు బయలుదేరుతాయని చెప్పారు. అల్ట్రాడీలక్స్ పోను రాను ఒక్కరికి టిక్కెట్ ధర రూ.805 మాత్రమే అన్నారు. ప్రయాణికులు ఆర్టీసీ రిజర్వేషన్‌కోసం 9959225677, 9160188845, 9441152934 ఫోన్‌నెంబర్లకు సంప్రదించాలన్నారు.

టీడీపీ నేతల కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



టీడీపీ నేత కుటుంబాన్ని పరామర్శిస్తున్న లక్ష్మీదేవమ్మ

కురబలకోట, జనవరి 21: టీడీపీ నేతల కుటుంబాలను తంబళ్లపల్లె మాజీ ఎమ్మె ల్యే ఏపీ లక్ష్మీదేవమ్మ ఆదివారం పరామర్శించారు. మండలంలోని దాదంవారిపల్లె కు చెందిన టీడీపీ నాయకుడు డీఆర్ సు రేంద్ర రెడ్డి కుమారుడు తరుణ్‌కుమార్‌రెడ్డి(28) అనారోగ్యంతో, టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు రెడ్డిశేఖర్‌రెడ్డి తండ్రి వెంకటరెడ్డి(80)లు ఇటీవల మృతి చెందారు. కాగా వారి కుటుంబాలను ఆమె వారి ఇంటికి వెళ్లి పరామర్శించి భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట రాజంపేట పార్లమెంటరీ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి అయూబ్ బాషా, మాజీ వైస్ ఎంపీపీ వెంకటరమణారెడ్డి, టీడీపీ నాయకులు డీఆర్ వెంకటరమణారెడ్డి, మోహన్‌రెడ్డి, రఘురామ్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, సిద్ధిక్, ప్రసాద్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.